


RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in


తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:63 FRIDAY,JULY 31,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :63 శుక్రవారం, జూలై 31, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## తెలంగాణలో వాన జోరు..



**తాలిపేరు, వట్టి వాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**

**గోదావరి ఉధృతికి పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు**

**సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి వరద.. పూర్తిగా ఆగిన బొగ్గు ఉత్పత్తి**

ధర్మఘంట: తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా, గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి.

2

## పాలమూరు, సీతమ్మ సాగర్‌కు లైన్ క్లియర్



**తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో ఊరట**

**పాలమూరు, సీతమ్మ సాగర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు మేలు**

**పాత పర్యావరణ అనుమతులు చెల్లుబాటవుతాయని స్పష్టత**


**కేంద్ర పర్యావరణ శాఖ మెమోరాండంను కొట్టివేసిన సుప్రీం**

ధర్మఘంట: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టుల మిగతా2లో

# ‘2034 వరకు నేనే సీఎం’

## ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ




ధర్మఘంట: విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన మిగతా2లో

## మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పు చేశారు

-వివరాలు7లో-




### ఉద్యోగులు, పెన్షనర్లకు రేవంత్ సర్కార్

## గుడ్‌న్యూస్

ధర్మఘంట: ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. గత 100 రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపులను పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మరో రూ.2,000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ మిగతా2లో

## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి



కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ

- పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న బండి సంజయ్
- నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలని సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపణ
- నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్న బండి సంజయ్

2



## రెండు రోజులుగా వర్షాలు..

**అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే మంత్రి కోమటిరెడ్డి**

హైదరాబాద్, జులై 30: తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు మిగతా2లో

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు


### గణేశ్ విగ్రహ తయారీదారులకు సీపీ హెచ్చరిక



హైదరాబాద్, జులై 30: గణేశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణేశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు వివరించారు. సమీక్షా సమావేశం నిర్వహించారు. మిగతా2లో

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

- రాజ్యసభలో పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- పేపర్ లీక్‌లకు పాల్పడితే 10 ఏళ్ల వరకు జైలు, రూ.50 లక్షల జరిమానా
- బిల్లుపై చర్చ సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రతిపక్ష నేత ఖర్గే



### తెలంగాణలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్..

తెలంగాణలో పేరుకుపోతున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ దరఖాస్తులు


రెండు రోజుల్లో జారీ చేయాలన్న నిబంధన అమలు కాని వైనం

2

### తల్లిదండ్రులను పట్టించుకోని కుమారుల విషయంలో కోర్టు సంచలన తీర్పు...

ఈ మధ్య కాలంలో చాలా మంది పిల్లలు 9 నెలలు కని పెంచి పెద్దవాళ్లను చేసిన తల్లిదండ్రులనే పట్టించుకోవడం లేదు. వయసు మళ్లిన పేరెంట్స్‌ను పట్టించుకోకుండా నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

2





2

### హైదరాబాద్ ప్రజలకు అదిరిపోయే న్యూస్.. నగరంలో మరో రెండు భారీ స్టీల్ ఫ్లైఓవర్లు.. ఈ ఏరియాలోనే..

# ‘2034 వరకు నేనే సీఎం’

విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. “మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి” అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్





రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

## తెలంగాణలో వాన జోరు..

తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా, గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జలాశయాలకు వరద నీరు పోటెత్తుతుండటంతో రైతాంగంలో ఆశలు చిగురిస్తుండగా, మరోవైపు పలుచోట్ల వరద ప్రభావం తీవ్రంగా ఉంది. ప్రధానంగా, సింగరేణి గనుల్లోకి నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలిగింది.
మంచిర్యాల జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ప్రస్తుతం 46 వేల క్యూసెక్కుల ఇన్-ఫ్లో నమోదవుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 12.88 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు 96,445 క్యూసెక్కుల వరద వస్తుండటంతో అధికారులు 24 గేట్లు ఎత్తి 96,472 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. అటు కొమురం భీం జిల్లాలోని వట్టి వాగు ప్రాజెక్టుకు 8 వేల క్యూసెక్కుల ఇన్-ఫ్లో వస్తుండగా, 3 గేట్లు ఎత్తి 10,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మరోవైపు, భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. జగిత్యాల జిల్లాలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ధర్మపురి వద్ద పుష్కర ఘాట్లను వరద తాకింది. అనంతారం బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భారీ వర్షాల ధాటికి మంచిర్యాల జిల్లాలోని ఇందారం, శ్రీరాంపూర్, కల్యాణి ఖని వంటి సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి భారీగా వరద నీరు చేరింది. దీనివల్ల రోజుకు సుమారు 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు 2 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయని అధికారులు వెల్లడించారు. వర్షాలు తగ్గుముఖం పట్టాకే గనుల్లో పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని వారు పేర్కొన్నారు.

## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు. సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. “గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది” అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## రెండు రోజులుగా వర్షాలు.. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే:

తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## తెలంగాణలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్..

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్‌ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసుకున్న రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో గడువు పాటించకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ పథకం ప్రారంభమైన జూలై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఇప్పటివరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో, వారు నిత్యం మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెల 25న విడుదల చేసిన జీవో 172 నిబంధనల ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు వాటిని పరిశీలించి సర్టిఫికెట్లను జారీ చేయాలి. అయితే, పలు ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు.

**సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ఇదే**

పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారం ఆధారంగా ప్రభుత్వం ‘తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్’ను సిద్ధం చేసింది. పౌరులు మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోగానే, ఆ దరఖాస్తు నేరుగా సంబంధిత తహశీల్దార్ లాగిన్‌లోకి వెళ్తుంది. అక్కడ తహశీల్దార్ ఆ వివరాలను రేషన్ కార్డు డేటాతో సరిపోల్చి చూసి, అంతా సక్రమంగా ఉంటే డిజిటల్ సంతకంతో ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలి. కానీ, తహశీల్దార్ల స్థాయిలో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పేరుకుపోతోంది.

# పాలమూరు, సీతమ్మ సాగర్‌కు లైన్ క్లియర్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై నెలకొన్న సందిగ్ధతను తొలగిస్తూ సర్వోన్నత న్యాయస్థానం తాజాగా కీలక తీర్పును వెలువరించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం (ఒవీ)ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. అయితే, ఈ తీర్పు భవిష్యత్తు వ్యవహారాలకు మాత్రమే వర్తిస్తుందని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. సదరు మెమోరాండం ప్రాతిపదికన గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ యథాతథంగా చెల్లుబాటులో ఉంటాయని న్యాయస్థానం తేల్చిచెప్పింది. సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తాజా తీర్పుతో తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు గతంలో లభించిన అనుమతులకు ఎటువంటి ఆటంకం లేదని స్పష్టమైంది. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి సహా ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి పర్యావరణ అనుమతుల రూపంలో ఎదురవుతున్న ప్రధాన అడ్డంకి దీంతో తొలగిపోయింది. ఈ పరిణామంతో సదరు ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మార్గం సుగమమైంది.

## హైదరాబాద్ ప్రజలకు అదిరిపోయే న్యూస్. నగరంలో మరో రెండు భారీ స్టీల్ ఫ్లైఓవర్లు..

హైదరాబాద్ వాసులకు శుభవార్త. నగరం నడిబొడ్డులో మరో రెండు స్టీల్ ఫ్లైఓవర్లు రానున్న రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. బంజారాహిల్స్ ప్రాంతంలో వీటి నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే నిధుల సర్దుబాటు కూడా చేసింది. త్వరలోనే వీటి నిర్మాణం ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయిహైదరాబాద్ ప్రజలకు గుడ్ న్యూస్. నగరంలో మరో రెండు స్టీల్ ఫ్లైఓవర్లు, ఒక అండర్ పాస్ రానున్నాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం వీటి నిర్మాణానికి తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీవీ9 సిగ్నల్ వల్ల ఒక స్టీల్ ఫ్లైఓవర్ రానుండగా.. బంజారాహిల్స్ ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద మరో స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. దాదాపు రూ.368 కోట్లతో ఈ ఫ్లైఓవర్లను నిర్మించాలని ప్రభుత్వం తలపెట్టింది. అలాగే ఒక అండర్ పాస్ కూడా ఇక్కడ నిర్మించనున్నారు. దీని వల్ల పంజాగుట్ట, శ్రీనగర్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ భారీగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పంజాగుట్ట నుంచి టీవీ9, బంజారాహిల్స్ వెళ్లే మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ఫ్లైఓవర్ల నిర్మాణంలో సిగ్నల్ ఫ్రీ జర్నీ చేయవచ్చు.రెండు స్టీల్ ఫ్లైఓవర్లు, ఒక అండర్ పాస్ ప్రభుత్వం ఈ రెండు ఫ్లైఓవర్లు, ఒక అండర్ పాస్‌కు పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు ఇక్కడ ఫ్లైఓవర్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ ప్రతిపాదనలు పంపగా.. దీని నిర్మాణానికి రూ.147 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇక టీవీ9 జంక్షన్ నుంచి ముగ్ద జంక్షన్ మీదుగా ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు 3 లైన్లతో ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇందుకోసం రూ.62 కోట్ల వ్యయం కానుంది. ఇక ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి శ్రీనగర్ కాలనీ వైపు రెండు లైన్ల అండర్ పాస్ రూ.159 కోట్లతో నిర్మించాలని సమగ్ర రిపోర్ట్ తయారుచేశారు.ట్రాఫిక్‌పై అధ్యయనం గతంలో ప్రతిపాదించిన రిపోర్ట్ ప్రకారం ఒక ఫ్లైఓవర్, ఒక అండర్ పాస్ మాత్రమే నిర్మించాలని భావించారు. కానీ ట్రాఫిక్ రద్దీపై అధ్యయనం చేసిన తర్వాత రెండు ఫ్లైఓవర్లు, ఒక అండర్ పాస్ నిర్మించాలనే నిర్ణయానికి వచ్చారు. దీంతో ప్రాజెక్ట్ వ్యయం రూ.210 కోట్ల నుంచి రూ.368 కోట్లకు పెరిగింది. హెచ్ సిటీ ప్రాజెక్ట్ కింద ఈ ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయం తీసుకుంది. స్ట్రక్చరల్ స్టీల్ టెక్నాలజీతో ఈ రెండు ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. దీని వల్ల నిర్మాణం కాలం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. బంజారాహిల్స్ కారిడార్‌గా దీనిని అధికారిక పత్రాల్లో దీనిని పేర్కొన్నారు

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు, 2026ను కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని ఏమాత్రం సహించబోమని, పేపర్ లీకేజీల పట్ల తమ ప్రభుత్వం ‘జీరో టాలరెన్స్’ విధానాన్ని అవలంబిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఈ బిల్లు ఒక నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ చట్టాన్ని తీసుకురావడంలో ప్రధానమంత్రి ఏమాత్రం జాప్యం చేయలేదని కేంద్రమంత్రి వెల్లడించారు. ఈ సవరణ బిల్లు నిబంధనల ప్రకారం, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ. 50 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. ఒకవేళ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడితే, కనీస శిక్షను ఏడేళ్లకు పెంచడంతో పాటు జరిమానాను రూ. 10 కోట్ల వరకు విధించేలా ప్రతిపాదించారు. దర్యాప్తును రెండు నెలల్లో పూర్తి చేసి, ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల లోపు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ ముగించాలని ఈ బిల్లు నిర్దేశిస్తోంది.
బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. నీట్ పేపర్ లీక్ అనంతరం ఎందరో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి, తద్వారా ప్రధానమంత్రి మోదీ కుర్చీని కాపాడారని ఖర్గే వ్యాఖ్యానించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: గణేశ్ విగ్రహ తయారీదారులకు సీపీ హెచ్చరిక

విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచిం చారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్ర హాల ప్రతిష్టాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్ర హాల తయారీ కేంద్రాల్లో ఫైర్ సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ధూల్‌పేట్, జల్‌పల్లి, మైలాం ్‌దేవ్‌పల్లి నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పా టు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను నివారించాలని ఆదే శించారు. రవాణాకు ముందు స్థానిక ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలని తయారీదారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. లోడింగ్, అన్ లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు సర్టిఫైడ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయ కుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఇవ్వాలని తయారీ దారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లైఓ వర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదే శిం చారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు సర్టిఫైడ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయకుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్

ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. గత 100 రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపులను పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మరో రూ.2,000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మూడు విడతల్లో ఒక్కోసారి రూ.2,000 కోట్ల చొప్పున మొత్తం రూ.6,000 కోట్లను విడుదల చేసింది. దీంతో పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల కమ్యూటేషన్ బకాయిలను పూర్తిగా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆదివాసీల హక్కుల పరిరక్షణే సామాజిక న్యాయానికి పునాది

-ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా
-కోరం వెంకటేశ్వర్లు (గణేష్ అన్న), టీఆర్ఎస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర సేన నాయకులు

భద్రాద్రి కొత్తగూడెం జూలై 30 (తెలంగాణ పత్రిక)



భారతదేశం అనేక సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలకు నిలయమైన దేశం. ఈ వైవిధ్యానికి ఆదివాసీ సమాజం ఒక గొప్ప ప్రతీక. ప్రకృతితో మమేకమై జీవించే ఆదివాసీలు అడవులను, జీవవైవిధ్యాన్ని, సంప్రదాయ విలువలను తరతరాలుగా పరిరక్షిస్తూ వస్తున్నారు. అలాంటి ఆదివాసీ సమాజానికి రాజ్యాంగం ప్రత్యేక రక్షణలు, హక్కులు కల్పించినప్పటికీ వాటి అమలు విషయంలో ఇంకా అనేక లోపాలు కొనసాగుతున్నాయి. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ అంశాలపై సమాజం, ప్రభుత్వాలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రిజర్వేషన్ విధానాన్ని తీసుకొచ్చారు. దీని ఉద్దేశం సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం. అయితే నేటికీ అనేక ఆదివాసీ కుటుంబాలు పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, ఆరోగ్య సమస్యలతో పోరాడుతుండటం బాధాకరం. తెలంగాణలో గిరిజనుల జనాభా గణనీయమైన స్థాయిలో ఉంది. రాష్ట్ర అభివృద్ధిలో వారికి కూడా సమాన భాగస్వామ్యం ఉండాలి. కానీ అనేక గిరిజన గ్రామాల్లో నేటికీ తాగునీరు, రహదారులు, నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అమలు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. పోడు భూముల సమస్య దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తోంది. అడవిని నమ్ముకొని జీవించే ఆదివాసీలకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కులు కల్పించడం ప్రభుత్వాల రాజ్యాంగబద్ధ బాధ్యత. అర్హులైన ప్రతి కుటుంబానికి అటవీ హక్కుల పత్రాలు అందించి, భూమిపై భద్రత కల్పించాలి. అటవీ పరిరక్షణతో పాటు ఆదివాసీల జీవన హక్కులను సమతుల్యంగా కాపాడే విధానాలు అమలు చేయాలి. అభివృద్ధి పేరుతో చేపట్టే ప్రాజెక్టులు స్థానిక ప్రజల జీవితాలపై ప్రభావం చూపకూడదు. భూములు, అడవులు, సహజ వనరుల వినియోగంలో రాజ్యాంగ నిబంధనలు, పర్యావరణ పరిరక్షణ, స్థానిక ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అభివృద్ధి ఫలాలు ఆదివాసీలకూ సమానంగా అందాలి. విద్యే ఆదివాసీ సమాజ పురోగతికి ప్రధాన సాధనం. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఉన్నత విద్యాసంస్థలను మరింత బలోపేతం చేయాలి. పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలి. రిజర్వేషన్ల అమలు పారదర్శకంగా జరిగి నిజమైన అర్హులకు ప్రయోజనం చేకూరాలి. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచాలి. ప్రతి మారుమూల గ్రామానికి వైద్య సేవలు చేరేలా చర్యలు తీసుకోవాలి. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, సాగునీటి సదుపాయాలు, వ్యవసాయ సహాయం, మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గిరిజన కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. ఆదివాసీల సంస్కృతి, భాష, సంప్రదాయాలు ఈ దేశ వారసత్వంలో భాగం. వాటిని పరిరక్షించడం ప్రభుత్వాలకే కాదు, సమాజానికీ బాధ్యత. అభివృద్ధి పేరుతో వారి సంస్కృతిని దెబ్బతీయకుండా, గౌరవించే విధానాలు అమలు కావాలి. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కేవలం వేడుక మాత్రమే కాదు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కులు, అభివృద్ధిపై సమాజం కొత్త సంకల్పం తీసుకునే రోజు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఆదివాసీ కుటుంబానికి చేరినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. భూమి, అడవి, నీరు, విద్య, ఉపాధి, ఆరోగ్యం, గౌరవప్రదమైన జీవితం---ఇవి దయాదాక్షిణ్యంగా ఇచ్చే వరాలు కావు; రాజ్యాంగం కల్పించిన హక్కులు. వాటిని సంపూర్ణంగా అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చినప్పుడే ఆదివాసీల అభ్యున్నతి సాధ్యమవుతుంది. అదే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి నిజమైన అర్థం, అదే భారత రాజ్యాంగానికి మనం అందించే గొప్ప గౌరవం.
కోరం వెంకటేశ్వర్లు (గణేష్ అన్న) టీఆర్ఎస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర సేన నాయకులు

# వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా వరుణయాగం ప్రారంభం

-సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని మంత్రులు, ప్రజాప్రతినిధుల ఆకాంక్ష

వేములవాడ, జూలై, 30, తెలంగాణ పత్రిక.





రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణార్థం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పిస్తూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న వరుణయాగం గురువారం వైభవంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అలాగే జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, ఐఏఎస్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) మహేష్ బి.,గితే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన గౌరవ అతిథులకు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా, దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఎస్పీ అందజేశారు. అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆలయ అర్చకులు, వేద పండితులకు వరుణ యాగం ప్రారంభం సందర్భంగా వర్ని సమర్పించారు.ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జూలై 30వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు. మొదటి రోజు కార్యక్రమాల్లో స్వస్తి పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణ జపాలు, వరుణయాగ హోమం, సంతత ధారాభిషేకం, జపానుష్ఠానాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా దేవస్థానం పరివార, అనుబంధ ఆలయాల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, విరాటపర్వ పారాయణాలు, ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు.భీమేశ్వర సదన్‌లోని ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శాలువాలతో గౌరవ మంత్రులను సత్కరించి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.వరుణయాగం అనేది కేవలం ఆధ్యాత్మిక క్రతువే కాకుండా లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు బాగా పండుతాయని తెలిపారు.సమృద్ధిగా వర్షాలు కురిస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు రాష్ట్రం వ్యవసాయరంగంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని, ప్రజలకు తాగునీటి సమస్యలు తీరడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా నెలకొంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే, దేవస్థానం.కార్యనిర్వహణాధికారి రమాదేవి, జిల్లా అధికారులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో ఇండ్లను పరిశీలించిన సర్పంచ్ ప్రత్యేక అధికారి

కోటగిరి తెలంగాణ పత్రిక జూలై 30.



కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక సర్పంచ్ పుప్పల గంగారం కొత్తపల్లి గ్రామ ప్రత్యేక అధికారి ఇరిగేషన్ ఏఈ రవికుమార్ శిథిల వ్యవస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించారు. ప్రత్యేక అధికారి రవికుమార్ ఇంటి యజమానులతో మాట్లాడుతూ... ఇండ్లను త్వరగా ఖాళీ చేసి సురక్షితమైన ఇండ్లలో జీవనం ఉండాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాలో అతి భారీ వర్షాలు ఉన్నాయని పై అధికారులు సూచించడంతో గ్రామాలలోని ఇండ్లను పరిశీలిస్తున్నామన్నారు. గ్రామంలోని పడిపోయిన ఇండ్లను నివేదిక తయారుచేసి ఉన్నత అధికారులకు అందజేస్తామన్నారు. ఇంటి యజమానులు ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా సురక్షితమైన ఇళ్లలో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పుప్పల గంగారం వార్డ్ మెంబర్ కోటగిరి సతీష్ మాజీ ఏఎంసి డైరెక్టర్ సుదర్శన్ అధికారులు...... ఇరిగేషన్ ఏఈ గ్రామ (ప్రత్యేక అధికారి) రాజ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జగదీష్ గ్రామ పాలన అధికారికి విట్టల్ ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద అంచులో పొంచి ఉన్న కరెంటు పోల్

-పట్టించుకోని అధికారులు..

ఖమ్మం జిల్లా ప్రతినిధి: జూలై 31 తెలంగాణ పత్రిక



వైరా సంత బజారు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న కరెంట్ పోల్ ప్రమాదం అంచుల్లో ఉంది. డ్రైనేజీ మధ్యలో వేసిన పోల్ కి ఆధారంగా అప్పట్లో కాంక్రీట్ వేశారు. డ్రైనేజీ వరదమూలంగా వేసిన కాంక్రీట్ కొట్టుకుపోయింది. ఇప్పుడు పైన విద్యుత్తు సర్వీస్ తీగల సపోర్టుతో పోల్ నిలబడి ఉంది. అసలే వర్షాకాలం కావడంతో డ్రైనేజీ వాటర్ ఉధృతంగా వస్తుంది. వర్షం వస్తున్న సమయంలో ఈదురు గాలులు గట్టిగా వీస్తున్నాయి. అధికారులు అశ్రద్ధ చేస్తే, కరెంట్ పోల్ కొప్పకూలే ప్రమాదం ఉంది. నిత్యం వందలాదిమంది ప్రయాణించే రహదారి పక్కన కరెంట్ పోల్ ప్రమాదంగా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానికులు ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోల్ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-చెరువులు వాగులు వద్దకు వెళ్లొద్దని డిప్యూటీ కలెక్టర్ హెచ్చరిక



తెలంగాణ పత్రిక దమ్మపేట జూలై 30

దమ్మపేట: అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దమ్మపేట డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ సూచించారు. చెరువులు, వాగులు, కాలువల వద్దకు వెళ్లవద్దని, ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. చేపల వేటకు కూడా వెళ్లవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా వరద నీరు చేరినా, నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే భారీ వర్షాల సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా, వర్షాలు తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు..


## పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఎస్సై శేఖర్ రెడ్డి




తెలంగాణ దిన ప్రతీక జులై 30:

శంకరపట్నం మండలం ధర్మారం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే సమయంలో చట్టాలను గౌరవించడం, సామాజిక సామరస్యాన్ని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. గ్రామ సర్పంచ్ చింతిరెడ్డి పద్మ మాట్లాడుతూ ప్రజల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్‌వాదులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహా స్వామిని దర్శనం చేసుకున్న డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ రవీందర్ కుమార్ దంపతులు




**జగిత్యాల, జూలై 30 (తెలంగాణ పత్రిక):**
జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ పి. రవీందర్ కుమార్ దంపతులు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి రాగా అర్చకులు సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్ స్వామి వారి శేష వస్త్రం ప్రసాదం ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రమణయ్య సముద్రాల వంశీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



**జగిత్యాల, జూలై 30 (తెలంగాణ పత్రిక):**
కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ కోరుట్ల పట్టణానికి చెందిన 114 మంది లబ్ధిదారులకు రూ. 1,14,13,224/- కోటి పద్నాలుగు లక్షల పదమూడు వేల రెండు వందల ఇరవై నాలుగు రూపాయలు కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.

## గ్రానైట్ పరిశ్రమలో బాల కార్మికులు.. యాజమాన్యంపై కేసు

**తెలంగాణ దిన ప్రతీక జులై 30:**
శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని కేవీకే గ్రానైట్స్‌లో బాల కార్మికులను పనిలో పెట్టుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆపరేషన్ ముస్కాన్-12లో భాగంగా హుజూరాబాద్ (ఎఫ్ఏసీ) సహాయ కార్మిక శాఖ అధికారి గుండాటి చక్రధర్ రెడ్డి బృందం తనిఖీలు నిర్వహించగా, స్టోన్ కటింగ్, డ్రిల్లింగ్ పనుల్లో 18 ఏళ్లు నిండని ముగ్గురు బాలలు పనిచేస్తున్నట్లు గుర్తించారు. సహాయ కార్మిక శాఖ ఫిర్యాదు మేరకు కేవీకే గ్రానైట్స్ యాజమాన్యంతో పాటు సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.

## జగిత్యాల పట్టణంలోని 16 వార్డులో సహాయక చర్యలు



**జగిత్యాల, జూలై 30 (తెలంగాణ పత్రిక):**
జగిత్యాల గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండ కురుస్తున్న భారీ వర్షాల కారణంగా 16వ వార్డులో సలీమా గార్డెన్ ప్రాంతంలో వర్షపు నీరు అధికంగా నిలిచిపోవడంతో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ మున్సిపల్ జేసీబీ సహాయంతో అత్యవసరంగా నీటి ప్రవాహానికి అడ్డంకులను వార్డ్ కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్ తొలగించారు. వైస్ చైర్మన్ మునిరోద్దీన్ (మున్నా ) ఆరిఫ్ జవాన్ బాబు విష్ణు తదితరులు ఉన్నారు. 16 వ వార్డులో ప్రజలకు ఏదైనా అత్యవసర సహాయం అవసరమైతే వెంటనే వార్డ్ కౌన్సిలర్ ను సంప్రదించాలని కోరారు.

## జగిత్యాల అర్బన్ డబుల్ బెడ్రూమ్ కాలనీలో పలు సమస్యలపై మహాధర్నా

**-బీసీ ఎస్సీ ఎస్టీ జెఏసి ఆధ్వర్యంలో విశారదన్ మహారాజ్ హాజర్ అరెస్ట్ విడుదల**





**జగిత్యాల పట్టణం, జూలై 30 (తెలంగాణ పత్రిక):**
జగిత్యాల అర్బన్ డబుల్ బెడ్రూమ్ కాలనీలో పలు సమస్యలపై కాలనీ వాసులతో బుధవారం రోజున సమావేశమై కాలనీలో తీవ్రమైన పలు సమస్యలపై చర్చించిన బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో విశారదన్ మహారాజ్ హాజరై పలు సమస్యలు తెలుసుకోని కాలనీ వాసులకు అండగా నిలిచారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇక్కడ సమస్యలపై ఎన్నిసార్లు చెప్పిన మున్సిపల్ అధికారులకు ఎన్ని వినతి పత్రాలు సమర్పించిన సమస్యలపై పట్టింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విశారదన్ మహారాజ్ కు విన్నవించుకుంటు నినాదాలు చేశారు. వెంటనే డబుల్ బెడ్రూమ్ కాలనీ వాసుల సమస్యలు తీర్చాలని అక్కడి 300 వందల మంది కాలనీ వాసులతో సమావేశం నిర్వహించగా సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి విశారదన్ మహారాజ్ ను అరెస్ట్ చేశారు. ఆగ్రహానికి గురి అయిన కాలనీ వాసులు సమస్యలు తీర్చడమే కాక మాకు మద్దతు తెలిపిన నాయకున్ని అరెస్ట్ చేస్తారా అని కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై మెరుపు మహాధర్నా చేశారు. ఇప్పటికైనా ఇక్కడ సమస్యలపై స్పందించి పరిష్కారం చూపకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వెంటనే విశారదన్ మహారాజ్ ను విడుదల చేయకపోతే వర్షానికి లెక్క చెయ్యకుండ రోడ్డుపై ధర్నాకు ఇలాగే కూర్చుంటామని పోలీసులను హెచ్చరించడంతో విశారదన్ మహారాజ్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ మానల కిషన్ పడాల శ్రీనివాస్ శివ కుమార్ స్వామి దూడ తిరుపతి కోటేష్ అనిల్ ఉపేంద్ర రాజారాం కాలనీ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బయోమెట్రిక్‌కు బదులు అగ్గిపెట్టె




**-ప్రభుత్వ బడిలో వినూత్న హాజరు విధానం**
**-పిల్లలే తమ హాజరును నమోదు చేసుకుంటున్న వైనం**
**-హాజరు పెంచిన ముస్లీ రాజయ్య సృజనాత్మక ఆలోచన**







**నంగునూరు, జూలై 30(తెలంగాణ పత్రిక):**
ప్రభుత్వ కార్యాలయాల్లో వేలిముద్రలతో హాజరు నమోదు చేసే బయోమెట్రిక్ వ్యవస్థ గురించి అందరికీ తెలుసు. కానీ ఓ ప్రభుత్వ పాఠశాలలో అగ్గిపెట్టెలతో రూపొందించిన హాజరు వ్యవస్థ ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'సెల్ఫ్ అటెండెన్స్ బోర్డు' విద్యార్థులను బడికి మరింత చేరువ చేస్తోంది. ప్రతి విద్యార్థికి ఒక అగ్గిపెట్టె, దానిపై ఫొటో. లోపల 'పీ', బయట 'ఏ'. వచ్చిన విద్యార్థి పెట్టెను తెరిస్తే 'పీ' కనిపిస్తుంది. రాని విద్యార్థి స్థానం వద్ద 'ఏ' అలాగే ఉంటుంది. హాజరు రిజిస్టర్ చూసే అవసరం లేకుండానే ఒక్క చూపులో తరగతి హాజరు స్థితి తెలిసిపోవడం దీని ప్రత్యేకత.

**ప్రతిరోజూ ముందుగానే వస్తాం**
- జెల్ల శివ ప్రసాద్, ఆరవ తరగతి విద్యార్థి.

"మా పేర్లు పిలిచే వరకు వేచి ఉండాల్సిన పని లేదు. మేమే హాజరు నమోదు చేసుకుంటాం. అందుకే ప్రతిరోజూ ముందుగానే వస్తాం."

**విద్యార్థుల్లో సమయ పాలన పెరిగింది**
- ముస్లీ రాజయ్య, ఆరవ తరగతి ఉపాధ్యాయుడు

"విద్యార్థులను క్రమం తప్పకుండా బడికి రప్పించాలని చేసిన ప్రయత్నం ఇది. దీని వల్ల విద్యార్థుల్లో సమయ పాలన పెరిగింది. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతా భావం పెంచడమే ఈ ప్రయోగం వెనుక ఉద్దేశం."

**విద్యార్థుల్లో పెరిగిన క్రమశిక్షణ**
- దాసరి సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల

"అగ్గి పెట్టె అటెండెన్స్ తో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. దీనివల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరిగింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం ఇచ్చే ఆవిష్కరణ ఇది.

# ప్రణాళికాబద్ధంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు







**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**వేములవాడ, జూలై,30, తెలంగాణ పత్రిక.**
దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల వరుణ యాగ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఆలయ అభివృద్ధి, విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2023-24లో రూ.50 కోట్లు, 2024-25లో రూ.100 కోట్లు కేటాయించగా, అనంతరం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో సుమారు 45 శాతం పూర్తయ్యాయని, మరో 10 నుంచి 12 నెలల్లో పూర్తి స్థాయిలో పనులు ముగించి, రాబోయే వెయ్యేళ్ల అవసరాలకు అనుగుణంగా రాజన్న ఆలయాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. భక్తుల సూచనలు, సలహాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.12 కోట్లతో వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ లో ఆధునిక పార్కు, భారీ శివుడి విగ్రహం, మొక్కలు, నటరాజ విగ్రహం పనులు పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే రూ.10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు, రూ.47 కోట్లతో వేములవాడలో 80 అడుగుల రహదారి విస్తరణ పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు.భక్తులకు అన్నదాన సేవలను మరింత విస్తరించేందుకు రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని తెలిపారు.ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వేములవాడ డిపోకు 20 కొత్త బస్సులు కేటాయించడం, అలాగే రూ.1.60 కోట్లతో తిప్పాపూర్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలో లీలా హాస్పిటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మిర్యాలగూడ ప్రతినిధి//జూలై 30:(తెలంగాణ ప్రతినిధి):-**
మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లీలా హాస్పిటల్ ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, పట్టణ 1టౌన్ ప్రెసిడెంట్ కోడిరెక్క ఇంద్ర కుమార్, పట్టణ 2టౌన్ ప్రెసిడెంట్ మొయిజ్ 47వ వార్డ్ కౌన్సిలర్ పారూఖ్ ముఖ్య అతిథిలుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అధునాతన, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. నిరుపేదలకు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంచాలని హాస్పిటల్ యాజమాన్యానికి సూచించారు. డాక్టర్స్ కాలనీలో ఇటువంటి మెరుగైన వైద్య సదుపాయాలు రావడం స్థానిక ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ?నూతన హాస్పిటల్ నిర్వాహకులకు, వైద్యులకు ఆయన తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ యాజమాన్యం, స్టాఫ్, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖ వైద్యులు, రాజకీయ నాయకులు, హాస్పిటల్ సిబ్బంది మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా సిపిఎం నాయకులు గట్టికోప్పుల రాంరెడ్డి ఏడవ వర్ధంతి

-తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వంతో ముందుకు కదలండి
-జిఆర్ వర్ధంతి సభలో డబ్బికార్ మల్లేష్ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు

మిర్యాలగూడ ప్రతినిధి// జులై 30:(తెలంగాణ పత్రిక):-



ప్రపంచంలో అనేక రైతాంగ పోరాటాలకు మార్గం చూపినటువంటి మహత్తరమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వంతో ముందుకు సాగి కమ్యూనిస్టు ప్రజా పోరాటాలను బలపరచాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికారు మల్లేష్ పిలుపునిచ్చారు. ఈరోజు మిర్యాలగూడ మండలం తడకమళ్ళ గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, సిపిఎం సీనియర్ నాయకులు గట్టికోప్పులు రామిరెడ్డి ఏడో వర్ధంతి సభలో వారు పాల్గొని వారికి నివాళులర్పించి మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అర్థం తెలియని ఆర్ఎస్ఎస్, బిజెపి పార్టీలు ఈరోజు దానిని ఒక మతోన్మాద గొడవగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్న తరుణంలో లౌకికవాదులు ప్రజాస్వామ్యవాదులు కమ్యూనిస్టులు చేస్తున్నటువంటి ప్రజా పోరాటాలకు మద్దతునిచ్చి ఆర్ఎస్ఎస్, బిజెపి చేస్తున్నటువంటి మతోన్మాద కుట్రలను తిప్పి కొట్టాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. దేశంలో విద్యార్థుల పోరాటాలను రైతాంగ పోరాటాలను కార్మిక పోరాటాలను అపహాస్యము చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నటువంటి కేంద్ర పాలక ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ప్రజాస్వామ్యం రక్షించుకోవాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గట్టికోప్పుల రాంరెడ్డి తోపుచర్ల ఫీరకగా పిలవబడే ఈ ప్రాంతానికి, ఈ ప్రాంతంలోనే కాకుండా మొత్తం మిర్యాలగూడ నియోజకవర్గంలో సిపిఎం నిర్మాణానికి సిపిఎం పార్టీ విస్తృత ఎదుగుదలకు తీవ్రంగా కృషి చేసి నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రాజాకార్లకు వ్యతిరేకంగా జరిగినటువంటి రైతాంగ పోరాటంలో పాల్గొని అనేక మందికి ఆదర్శంగా నిలిచారని వారు ఈ సందర్భంగా వారి యొక్క సేవలను కొనియాడారు. తడకమల్ల గ్రామానికి సర్పంచ్ గా 40 సంవత్సరాల పాటు సేవలందించి తలకమళ్ళతో పాటు చుట్టూ అనేక గ్రామాల అభివృద్ధి పనులు నడిపినటువంటి గొప్ప నాయకుడు జి ఆర్ ని వారు తెలిపారు. ఈ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం, రోడ్డు సౌకర్యం, నీటి సౌకర్యం ఈరోజు అందరికీ సమానంగా అందుతున్నాయి అంటే అది గట్టుకొప్పుల రామిరెడ్డి, సిపిఎం పార్టీ కృషి అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి మల్లు గౌతమ్ రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాదూరు శశిధర్ రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి,రెమిడాల పరశు రాములు, మాజీ సర్పంచ్ లు చనగాని సైదమ్మ, వెంకటయ్య, గట్టికుప్పుల రాంరెడ్డి సతీమణి వరమ్మ, వారి కుమారుడు వినాయక రెడ్డి, తడకమల్ల శాఖ కార్యదర్శి పంగా అశోక్, జిల్లోజు శ్రీను, జిల్లోజు పుల్లయ్య,కుమ్మరి సైదులు, గోపాలదాసు సుధాకర్, గుంటి శ్రీను, మొరిశెట్టి నరసయ్య, మండల కమిటీ సభ్యులు చౌగాని వెంకన్న, ఉన్నాం వెంకటేశ్వర్లు, ఆశీర్వాదం, చారి, జి ఆర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు నేపథ్యంలో ఉచిత వాహన సేవ

-మాజీ ఉప సర్పంచ్ గడ్డం సుభాష్

ముధోల్:30జూలై(తెలంగాణ పత్రిక)



భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రమైన ముధోల్ ప్రజలకు ఉచిత వాహన సేవ అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని మాజీ ఉప సర్పంచ్,సామాజిక కార్యకర్త గడ్డం సుభాష్ చెప్పారు. దీంతో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గ్రామాల్లో ఎవరైనా అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైన రోడ్డు ప్రమాదానికి గురైన గుండెపోటు,శ్వాస సంబంధిత సమస్యలు లేదా ఇతర అత్యవసర ఆరోగ్య పరిస్థితులు ఎదురైనా వెంటనే స్పందిస్తానన్నారు. గర్భిణీ స్త్రీలను ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి వచ్చినా పగలు--రాత్రి అనే తేడా లేకుండా, అర్ధరాత్రి అయినా సరే తన సొంత వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా రవాణా సౌకర్యాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మానవత్వమే మహోన్నతమైన సేవ అనే భావనతో అత్యవసర సమయంలో ప్రజలకు అండగా నిలిచి తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తానన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ప్రజలు సంకోచించకుండా పగలైనా, రాత్రైనా తనను సంప్రదించవచ్చని తెలిపారు.

# స్నేహానికి నిలువెత్తు నిదర్శనం

-మిత్రుడి కుటుంబానికి రూ.11 వేల సాయం....

నంగునూరు, జూలై 30(తెలంగాణ పత్రిక):



కష్టకాలంలో మిత్రులే నిజమైన బలం అని నిరూపిస్తూ నంగునూరుకు చెందిన బొజ్జ గోపి కుటుంబానికి ఆయన సహచర విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన గోపి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో 1997 - 98 విద్యా సంవత్సరంలో ఆయనతో కలిసి పదో తరగతి చదివిన స్నేహితులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.11 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామానికి చెందిన బొజ్జ గోపి (44) దర్జీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయన మృతితో భార్య, కుమారుడు దిక్కుతోచని స్థితిలో ఉండగా, విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు వెంటనే స్పందించారు. తమ స్నేహితుడి కుటుంబానికి తోడుగా నిలవాలనే సంకల్పంతో అందరూ కలిసి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్నేహం అనేది కేవలం కలిసి చదివిన జ్ఞాపకాలకే పరిమితం కాదని, అవసరమైన సమయంలో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన స్నేహమని పేర్కొన్నారు. తమ మిత్రుడు ఇక లేడనే బాధ ఉన్నప్పటికీ, ఆయన కుటుంబానికి తమ వంతు సహకారం అందించడం బాధ్యతగా భావించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. సహచరుల ఆర్థిక సాయంతో మృతుడి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్ననాటి స్నేహాన్ని మరువకుండా మిత్రుడి కుటుంబానికి సహాయం అందించిన ఈ చర్య గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది. మానవత్వం, స్నేహ బంధానికి ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం పలువురికి ఆదర్శంగా నిలిచిందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పప్పు సురేందర్ రెడ్డి, ఎండి షాకీర్, ఇరుకుల్ల కృష్ణ, దాసరి శ్రీనివాస్, కట్కూరు భూపాల్ రెడ్డి, పాపిగాని కృష్ణ, రాగుల చంద్రం, సనాధుల సతీశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో రెండు ఆవులు మృతి



కోటగిరి తెలంగాణ పత్రిక జూలై 30.

కోటగిరి మండలంలోని సుద్ధులం గ్రామంలో విద్యుత్ షాక్ తో గోపు (బంగారు) సాయిలు అనే వ్యక్తి ఆవులు ట్రాన్స్ఫారంకు తగిలి మృతి చెందాయని గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన ఆవుల విలువ ఒక్కొక్కటి 90000 వేలు రెండు కలిపి ?1,80,000 ఉన్నాయని మృతి చెందిన ఆవుల యజమాని గోపు సాయిలు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడుని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



-గురుకుల బీసీ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే
-ఆగష్టు 15లోగా ప్రతిరోజు అన్ని ప్రభుత్వం పాఠశాలలు, గురుకులాలను సందర్శించనున్న.. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ ప్రతినిధి// జులై 30:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్‌లోని ఎంజేపీటీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ ను గురువారం ఉదయం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి టీచర్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు, విద్యా బోధన, సిబ్బంది సమస్యలు, ఇతర అవసరాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై వారి విద్యాభ్యాసం, హాస్టల్ వసతులు, ఆహారం, తాగునీరు, పరిశుభ్రత, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనిలి తెలిపారు. డా,, బి ఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగా చదువు ఒక్కటే మన స్థితి గతులను, మన కుటుంబ స్థితిగతులు మారుస్తుంది. మన జీవన శైలిని మారుస్తుంది. కాబట్టి ప్రతిఒక్క విద్యార్థి మంచిగా చదువుకొని తమ భవిష్యత్తు తో పాటు మన దేశ భవిష్యత్ కు ఉపయోగకరంగా మారాలి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతిరోజూ మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఉదయం అసెంబ్లీలో విద్యార్థులతో కలిసి పాల్గొని వారికి విద్య యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫామ్‌లను విద్యార్థులకు పంపిణీ చేసి, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, నాణ్యమైన భోజనం అందించడం కోసం కాస్మోటిక్ చార్జీలు పెంచడం, విద్యా సంవత్సరం మొదటి నెల లోనే విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్ అందజేయడం లాంటి అనేక సంక్షేమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# సిరిసిల్ల పెద్ద బజార్లో కూలిన భారీ వృక్షం

-మినీ వ్యాన్ పై కూలడంతో ఒకరికి గాయాలు



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 30, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పెద్ద బజార్లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఓ భారీ వృక్షం నేల కూలింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం అక్క పెల్లి గ్రామానికి చెందిన అరుకుటి రాజు అనే వ్యక్తి తన మినీ వ్యాను లో సిరిసిల్లలోని కలెక్టరేట్ కు వెళ్తున్నాడు. స్థానిక గాంధీ చౌరస్తా నుండి పెద్ద బజారు మీదుగా వెళుతున్న సమయంలో హనుమాన్ ఆలయం వద్దకు చేరుకుగానే భారీ వేపచెట్టు ఒకసారిగా నేలకొరిగింది. చెట్టు రాజు వెళ్తున్న వ్యాన్ పై పడడంతో అతడి తలకు గాయాలు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు రాజును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక కౌన్సిలర్ అటుచెర్ల సాయి కృష్ణ అధికారులకు సమాచారం అందించి రోడ్డుపై కూలిన చెట్టును తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారూ. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇదే ప్రాంతంలోని హనుమాన్ ఆలయం, విమల్ థియేటర్ సమీపంలో ఉన్న భారీ వృక్షాలను తొలగించాలని అధికారులకు సూచించారు. పెద్ద బజార్ రోడ్డులో నేలకూలిన చెట్లు తొలగించాలని గతంలోని అధికారులు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నిరుపేద కుటుంబానికి హరీశ్‌రావు ఆర్థిక సాయంబొజ్జ గోపి కుటుంబానికి రూ.5 వేల సహాయం అందజేత



నంగునూరు, జూలై 30(తెలంగాణ పత్రిక):

సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యుడు, వృత్తిరీత్యా దర్జీగా పని చేసే బొజ్జ గోపి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు మానవీయ స్పందనతో కుటుంబానికి అండగా నిలిచారు. గోపి మరణించిన విషయాన్ని పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్ గౌడ్ ఎమ్మెల్యే హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు కుటుంబానికి దహన సంస్కారాల నిర్వహణ కోసం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం హరీశ్ రావు ప్రత్యేకత అని పేర్కొన్నారు. బాధలో ఉన్న కుటుంబానికి ఆయన అందించిన సహాయం కొంతమేర ఊరట ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ సనాదుల బాల పోచయ్య, మాజీ ఎంపీటీసీ జయపాల్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఉల్లి మల్లయ్య, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ రహీం పాషా, వార్డు సభ్యులు రచ్చ సిద్ధు, గోపి, దాసరి శ్రీను, బీఆర్ఎస్వీ నాయకుడు దాసరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దోమకొండ మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా గణేష్



కామారెడ్డి, జులై 30, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా అందే గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మార్కండేయ మందిరంలో జరిగిన సంఘం మండల పద్మశాలి సమావేశంలో గణేష్ ను సంగం మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం చేశారు. ఆయనతోపాటు సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా సిరిమల్లె రాజు, కోశాధికారిగా ఏల్దండ రవి లను ఎన్నుకున్నారు. కాగా మండలంలో పద్మశాలీలు రాజకీయంగా ఎదగడానికి, పద్మశాలీలు ఐక్యంగా ఉండడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దోమకొండ సర్పంచ్ ఐరేని నరసయ్య, ఉప సర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బత్తిని సిద్ధ రాములు,పద్మశాలి సంఘం దోమకొండ పట్టణ అధ్యక్షుడు మేక నాగరాజ్, ప్రధాన కార్యదర్శి బొమ్మెర గంగాధర్, క్యాషియర్ గణేష్, మండల పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి సిరిమల్లె రాజు, కోశాధికారి ఎల్దండ రవి, కొట్టాల గడ్డ పద్మశాలి సంఘం అధ్యక్షుడు జగదీష్, వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్, బీసు సతీష్ కుమార్, ఐరేని రాజేందర్, చేనేత సహకార సంఘం డైరెక్టర్లు సుంచు రాములు,బాలే సురేందర్, అందే నాగభూషణం, బీసు సంతోష్ కుమార్, అందే లింగం, దీకొండ శంకర్ పద్మశాలి సంఘం కుల పెద్దలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-ఎస్సై శ్రీనివాస్ గౌడ్

పాపన్నపేట, జూలై 30:(తెలంగాణ పత్రిక)



ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల చెరువులు, మత్తడులు ఉప్పొంగి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దీంతో ప్రజలు, మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఏడుపాయల కు వెళ్లే భక్తులు, ఘనపురం ప్రాజెక్ట్ వద్ద వరద ఎక్కువగా ఉన్నందువలన మంజీర నదిలో స్నానాలు చేయవద్దని హెచ్చరించారు. పూరి ఇళ్లలో ఉండేవారు, నాసిరకం గోడల వద్ద, చెట్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవద్దని సూచించారు. రైతులు పొలాలకు వెళ్లే సమయంలో విద్యుత్ వైర్లను ముట్టుకోవద్దని హెచ్చరించారు. రోడ్లపై ప్రవహిస్తున్న వాగులు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి





-తపస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ నర్సిరెడ్డి

నంగునూరు, జూలై 30(తెలంగాణ పత్రిక):

విద్యారంగంలో పేరుకు పోయిన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. తపస్ నంగునూరు మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వంగ నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు డీఏలను పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. మూడు సంవత్సరాలు గడిచినా పీఆర్సీపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. బదిలీలు, పదోన్నతుల అంశాలను నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ అమలు చేయడం లేదన్నారు.

**ఆగస్టు 1 ధర్నాకు మద్దతు కోరిన తపస్**

తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయల తిరుపతి మాట్లాడుతూ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతర పోరాటం కొనసాగిస్తోందన్నారు. ఈ పోరాటంలో భాగంగా ఆగస్టు 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న భారీ ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం**

తపస్ నంగునూరు మండల అధ్యక్షుడు కత్తుల రాంరెడ్డి మాట్లాడుతూ, సంఘం పట్ల ఉపాధ్యాయులు చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సిద్దిపేట డివిజన్ కార్యదర్శి అనుముల వీరేశం మాట్లాడుతూ, సభ్యత్వ అభియాన్‌కు విశేష స్పందన లభించిందని తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గడీల శ్రీకాంత్, చంద్రకాంత్, శ్రీనివాస్ రెడ్డి, జి. వెంకటేశం, మునరాశి రాములు, మురళీధర్ రెడ్డి, పల్నాటి శ్రీనివాస్, పులగూర్ల రాజేశ్వర్ రెడ్డి, వీరారెడ్డి, అనిల్ యాదవ్, గోవర్ధన్, పరశురాములు, బాలకిషన్, సుమలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో చివరి మూడు రోజులు ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేయాలి

-ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

-అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి గడువు ముగిసేలోపు 100% ప్రక్రియ పూర్తి చేయాలి...

ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

మిర్యాలగూడ ప్రతినిధి// జులై 30:(తెలంగాణ పత్రిక):-





మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు బిఎల్ఏ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు..ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ప్రభుత్వం విప్, ఎమ్మెల్సీ, నల్గొండ పార్లమెంట్ సర్ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ మరియు కె. శ్రీనివాస్ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మిర్యాలగూడ నియోజకవర్గ సర్ ఇన్‌చార్జి షబ్బీర్ అలీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఏ లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియకు నిర్దేశించిన గడువు ఆగస్టు 3తో ముగియనున్న నేపథ్యంలో మిగిలిన మూడు రోజులు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేసి మిర్యాలగూడ నియోజకవర్గంలో ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు..తెలంగాణ రాష్ట్రంలో సర్ ప్రక్రియపై అత్యధిక సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్న ఏకైక ఎమ్మెల్యే మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో ఎమ్మెల్యే నిరంతర పర్యవేక్షణ, నాయకులకు దిశానిర్దేశం కీలకంగా నిలుస్తోందని అభినందించారు.. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి నివసిస్తున్న ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, ఇప్పటికే సర్ ప్రక్రియలో 86శాతం నమోదు పూర్తి చేసి జిల్లాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నామని తెలిపారు. మిగిలిన అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి, గడువు ముగిసేలోపు వంద శాతం ప్రక్రియ పూర్తి చేసే దిశగా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ఇంచార్జులు, బి ఎల్ ఎ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎడతెరపి లేని వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 30, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు రోజుల నుంచి ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం జనజీవనంపై ప్రభావం చూపుతోంది. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు జిల్లాలోని బోయిన పల్లి, చందుర్తి, తంగళ్లపల్లి, రుద్రంగి, కోనరావుపేట, ఇల్లంతకుంట, వీర్నపల్లి, గంభీరావుపేట తదితర మండలాల్లో ఉదయం నుంచే చిరు జల్లులతో ప్రారంభమైన వర్షం క్రమంగా మోస్తరు నుంచి భారీ వర్షంగా మారింది.ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రధాన రహదారులు, వీధులు, కాలనీలు పూర్తిగా చిత్తడిగా మారాయి. పలు ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణిస్తున్నారు. వర్షం కారణంగా వాహనాల రాకపోకలు మందగించగా, కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది.సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావడం లేదు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి తమ పనులకు వెళు_న్నారు. చిరు వ్యాపారులపై కూడా వర్ష ప్రభావం పడింది. రోడ్లపై రద్దీ తగ్గి, మార్కెట్ ప్రాంతాలు సాధారణ రోజుల కంటే నిర్మానుష్యంగా కనిపించాయి.దలోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో స్థానికులు అప్రమత్తంగా ఉన్నారు. మురుగు కాలువలు నిండిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో నీటి ప్రవాహం రోడ్లపైకి రావడం కనిపించింది. మున్సిపల్ సిబ్బంది పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.మరోవైపు రైతుల్లో ఈ వర్షాలు ఆశలు నింపుతున్నాయి. ఇటీవల సాగు చేసిన వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు ఈ వర్షాలు ఉపయోగపడతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కొనసాగితే లోతట్టు వ్యవసాయ భూముల్లో నీరు నిలిచి పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో మరికొన్ని గంటల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అత్యవసరం అయితేనే బయటకు రావాలని, వర్షపు నీటిలో విద్యుత్ తీగలు కనిపిస్తే వాటికి దూరంగా ఉండాలని, చెట్ల కింద నిలబడకూడదని, వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# లోతట్టు వంతెనను పరిశీలించిన ఎంపీడీవో

-గ్రామాలకు రాకపోకలు బంద్

ముధోల్:30జూలై(తెలంగాణ పత్రిక)



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముధోల్ ఎంపీడీవో లవ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ముద్గల్ లోతట్టు వంతెన వద్ద ప్రవహిస్తున్న వరద నీరును పరిశీలించారు.దీంతో వెంటనే గ్రామాలకు రాకపోకలు కొనసాగించవద్దని గ్రామస్తులకు సూచించారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ పొదలను ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామపంచాయతీ సిబ్బందికి తెలియజేశారు. ప్రజలు అత్యవసర సమయాల్లో తప్ప ఇండ్ల నుండి బయటకి రాకూడదన్నారు.అదేవిధంగా చెరువులు, వాగులు వద్దకు వెళ్లకూడదన్నారు. ఎంపిడివో వెంట సర్పంచ్ అనురాధ గణపతి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ తోపాటు తదితరులున్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం





**-స్తంభించిన జనజీవనం**
**-ఝరి-బి వాగుపై నుండి ప్రవహిస్తున్న నీరు**
**-వరద నీటిలోనే వంతెన దాటుతున్న ప్రజలు**

తానూర్: 30జూలై (తెలంగాణ పత్రిక)

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తానూరు మండలం కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇంట్లో నుండి బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. అధికారులు అత్యవసర పరిస్థితిలో తప్ప ఇంట్లో నుండి బయటకి వెళ్లకూడదని సూచిస్తున్నారు. దీంతో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మండలంలోని 'ఝరి-బి' గ్రామ వంతెన నుండి వర్షపు నీరు భారీ ప్రవాహంతో ప్రవహిస్తుండడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపో యాయి. గ్రామస్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.ప్రతి సంవత్స రం వర్షాలు పడగానే అధికారులు వచ్చి వాగును పరిశీలించి తప్ప ప్రణాళికను చేసిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. ఈ వాగు దాటితేనే ఊరి దాటి వెళ్లేందుకు దారి ఉంది. పొలాలకు వెళ్లాలన్నా, పశువులను మేతకు తీసుకెళ్లాలన్నా, చివరకు రెక్కాడితే గానీ డొక్కాడని కూలీ పనులకు వెళ్లాలన్నా ప్రాణాలకు తెగించి ఈ వాగును దాటాల్సి వస్తోంది. మరీ ముఖ్యంగా అర్ధరాత్రి వేళల్లో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే, ఆసుపత్రికి తరలించేందుకు రవాణా సౌకర్యం లేక నరకయాతన అనుభ విస్తున్నామని, అనేకసార్లు అత్యవ సర వైద్యం అందక అవస్థలు పడు తున్నామని గ్రామస్థులు వాపోతు న్నారు.ప్రభుత్వం తక్షణమే స్పం దించి వంతెనకు శాశ్వత పరిష్కారం చేయాలని గ్రామస్తులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోవడం లేదు: ఝరి(బి) సమీపంలో బ్రిడ్జి నిర్మించిలని అధికారులకు విన్నపించిన పట్టించుకోవడం లేదు వర్షాలు కురిసిన వరదలు వస్తే కష్టాలు పడుతున్నారు వరదలు వస్తే బయటకు వెళ్లలేకపోతున్నా. గైక్వాడ్ సాయినాథ్

# కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు అరకొర నిధులే: సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్

తెలంగాణ పత్రిక దమ్మపేట జూలై 30

దమ్మపేట: కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్ వ్యవస్థకు చాలా తక్కువ నిధులు కేటాయించడం వల్లే అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ విమర్శించారు. గురువారం దురదపాడు, చలమప్పగూడెం గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్ల సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన పిట్టల అర్జున్ మాట్లాడుతూ...లక్ష్యం నీరుగారుతోంది: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు పౌష్టికాహారం అందించడం, మాతాశిశు మరణాలను తగ్గించడమే లక్ష్యంగా ఐసీడీఎస్ ఆవిర్భవించింది. అయితే పాలకులు వహిస్తున్న నిర్లక్ష్యం వల్ల ఆశించిన ఉద్దేశం నెరవేరడం




లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం: అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచడంలో, ఉద్యోగ భద్రతతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

**ప్రధాన డిమాండ్లు & పిలుపు:**

కనీస వేతనం: అంగన్‌వాడీ ఉద్యోగులకు నెలకు ?26,000 కనీస వేతనం చెల్లించాలి. కోడ్‌ల రద్దు: కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి. జైలు భరో: రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10న 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో చేపట్టే 'జైలు భరో' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘుతో పాటు అంగన్‌వాడీ ప్రతినిధులు సూరమ్మ, జ్యోతి, వెంకటేశ్వరమ్మ, శ్రీదేవి, వజ్రమ్మ, వెంకటలక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి ప్రజల చిరకాల కల బస్సు డిపో





**-దసరా వరకు ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులు పూర్తి..**
**-నూతన బస్సు డిపోతో పెరగనున్న రవాణా సౌకర్యాలు..**
**-ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..**
**-ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు..**

పెద్దపల్లి, ప్రతినిధి జూలై 30 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆర్టీసీ ఎండి నాగి రెడ్డి తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న బస్సు డిపో పనులను తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి గారితో కలిసి పరిశీలించడం జరిగింది అని దసరా వరకు పెద్దపల్లి బస్సు డిపో ప్రారంభించే దిశగా పనులు త్వరత్వరగా జరిగేల ఎం.డి గారు అధికారులకు మరియు కాంట్రాక్టర్ కు తెలిపారన్నారు. బస్సు డిపో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లల్లో బస్సు డిపో ఉన్నప్పటికీ మొదటి నుండి పెద్దపల్లి కూడా రెవేన్యూ డివిజన్ అయినప్పటికీ కూడా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో డిపో లేకపోవడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష అయిన బస్సు డిపో మంజూరు చేయమని వినతి పత్రం అందజేసిన తర్వాత వారు పెద్దపల్లి ప్రజలపై ఉన్న మమకారంతో వారు 2024 డిసెంబర్ మాసంలో పెద్దపల్లి ప్రాంతానికి విచ్చేసి యువ వికాసం బహిరంగ సభలో బస్సు డిపో మంజూరు చేయడం జరిగిందన్నారు. పెద్దపల్లి బస్సు డిపోను దసరా వరకు పూర్తి చేస్తామని ఆర్టీసీ ఎండీ తెలిపారని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, ఆర్టీసీ అధికారులు, పట్టణ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన వంతెన వద్ద- పరిస్థితులపై ప్రత్యేక అధికారి ఆరా




తానూర్: 30జూలై (తెలంగాణ పత్రిక)

మండలంలోని ఝరి(బి) గ్రామ సమీపంలోని లోలెవల్ వంతెన ను ప్రత్యేక అధికారి శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. వర్షాల కారణంగా వంతెనపై నెలకొన్న పరిస్థితిని పరిశీలించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వంతెన దాటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఎమ్మార్వో మహేందర్ నాథ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## సడెన్‌గా ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు ఎందుకు..? RBI ప్లాన్ మామూలుగా లేదుగా..



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను తీసుకురానుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే పాలిమర్ ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను తీసుకురావడం అనేక అనేక నిజాలు దాగి ఉన్నాయి. అవేంటి అనేది ఇప్పుడు చూద్దాంరిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(=దీ×) త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ఇప్పటికే ఆర్బీఐ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చింది. దీంతో త్వరలోనే ప్లాస్టిక్ నోట్లను ఆర్బీఐ తయారుచేయనుంది. ప్రస్తుతం ఉన్న పేపర్ కరెన్సీ స్థానంలో వీటిని చలామణిలోకి తీసుకురానుంది. ఇప్పటికే చాలా దేశాల్లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను వినియోగిస్తున్నారు. అదే తరహాలోనే భారత్ కూడా పాలిమర్ ప్లాస్టిక్ నోట్లను తీసుకురానుంది అయితే చాలామందిలో అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను తీసుకొస్తే ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీ నోట్లు చెల్లుతాయా..? అసలు ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి కారణం ఏంటి? అనే విషయాలు ఇప్పుడు చూద్దాంప్లాస్టిక్ నోట్లను తీసుకురావడం వెనుక అసలు నిజాలు ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీ నోట్లను ప్రత్యేక కాటన్‌తో తయారుచేస్తున్నారు. ఇవి త్వరగా చిరిగిపోవడంతో పాటు మురికిగా మారుతున్నాయి. అలాగే ఒకరి చేతుల నుంచి మరొకరి చేతుల్లోకి మారడం వల్ల త్వరగా పాడైపోతున్నాయి. దీని వల్ల ఆర్బీఐ ప్రతీ ఏడాది చిరిగిపోయిన లేదా పాడైపోయిన నోట్లను సేకరించి రీసైకిల్ చేయాల్సి వస్తోంది. కాగితపు కరెన్సీ నోట్ల ప్రింటింగ్‌కు ఆర్బీఐ వేల కోట్లు ఖర్చు చేస్తోంది. అయితే త్వరగా పాడైపోవడం వల్ల ఖర్చు వృథా అవుతోంది. అదే ప్లాస్టిక్ నోట్లతో అలాంటి ఇబ్బంది ఉండదు. ఈ నోట్లు 2 నుంచి 3 రెట్లు ఎక్కువకాలం మన్నుతాయి. అలాగే ఈ కొత్త నోట్లల్లో అత్యాధునిక హోలోగ్రామ్, పారదర్శక విండోలు వంటి హైటెక్ సెక్యూరిటీ ఫీచర్లు ఉన్నాయి. దీంతో నకిలీ నోట్లను తయారుచేయడం కూడా దాదాపు అసాధ్యమని చెబుతున్నారు.ప్లాస్టిక్ నోట్ల వల్ల లాభాలు.. ప్లాస్టిక్ నోట్ల వల్ల అనేక లాభాలు ఉన్నాయి. కేవలం చిరిగిపోకుండా, పాడైపోకుండా ఉండటమే కాకుండా తేలికగా, సులభంగా ఉంటాయి. నీటిలో తడిసినా లేదా వాషింగ్ మెషిన్‌లో వేసినా నలిగిపోకుండా ఉండే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. దీంతో ఈ నోట్లను తీసుకొచ్చేందుకు కేంద్రం, ఆర్బీఐ ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, సింగపూర్, మలేషియా, థాయిలాండ్ లాంటి దేశాలు పాలిమర్ నోట్లను ఉపయోగిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 60కిపైగా దేశాలు ఈ నోట్లను వినియోగిస్తున్నాయి. ఇప్పుడు ఆ దేశాల సరసన భారత్ కూడా చేరనుంది. తొలుత రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్లను తీసుకురానున్నారు. అయితే కొత్త ప్లాస్టిక్ నోట్లు వచ్చిన తర్వాత పాత నోట్లను చలామణి నుంచి క్రమక్రమంగా వెనక్కి తీసుకుకంటారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్. బ్యాగ్స్. పలకలు పంపిణీ

**-జి య స్ య స్. సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత...**



వాజేడు.వాజేడు తెలంగాణ పత్రిక ప్రతినిధి ములుగు జిల్లా. జులై. 30


ములుగు జిల్లా వాజేడు మండలం బొల్లారం గ్రామంలో పాఠశాల నందు గురువారం జి. య స్. య స్. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 70 మంది నిరుపేద విద్యార్థులకు బ్యాగ్స్. పలకలు. నోటు బుక్స్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు. వి. విజయలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సూపర్వైజర్. రాము - మాట్లాడుతూ. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రతి నిరుపేద విద్యార్థులకు సేవలందించడమే లక్ష్యంగా మా సమస్త ముందుకు వస్తుందని జి య స్ య స్. స్వచ్ఛంద సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి య స్ య స్ సంస్థ సూపర్వైజర్. రాము. మురళి రెడ్డి. శ్యామ్. నవీన్. బొల్లారం గ్రామస్తులు. విద్యార్థులు పాల్గొన్నారు..

# భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

-రెడ్ అలర్ట్ నేపథ్యంలో వచ్చే 24 గంటలు అత్యంత కీలకం
-ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి
-చెరువులు, గోదావరి పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలి
-ముంపుకు గురైన కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని వసతులు కల్పించాలి
-జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన
-రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

పెద్దపల్లి,ప్రతినిధి జూలై-30 ( తెలంగాణ పత్రిక )

గత 48 గంటలుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ నేపథ్యంలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుఅధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ లతో కలిసి భారీ వర్షాల పరిస్థితిపై జిల్లా అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, జిల్లాలోని ఒక్క చెరువు కూడా గండి పడకుండా లేదా తెగిపోకుండా సాగునీటి శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా సాగునీటి శాఖ అధికారి ఆధ్వర్యంలో లస్కర్లు, సహాయ ఇంజినీర్లు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పూర్తి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) చెరువులను పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలతో కలిసి నిరంతరం పరిశీలించాలని సూచించారు.





చెరువుల్లో గండ్లు, నీటి పొంగిపొర్లడం లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నీట మునిగిన కాజ్‌వేలు, లోతట్టు రహదారులను వెంటనే రాకపోకలకు మూసివేయాలని, అలాంటి ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు, పోలీసు సిబ్బందిని మోహరించి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వర్షాల వల్ల దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లను వెంటనే గుర్తించి అత్యవసర మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పశువుల నష్టం వంటి ఘటనలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిహార ప్రతిపాదనలు సిద్ధం చేసి ట్రెజరీకి పంపించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లు తదితర స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. నీట మునిగిన ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి, అక్కడ ఆహారం, తాగునీరు, వసతి, తదితర అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లను వెంటనే గుర్తించి వాటిలో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) అధికారులు విద్యుత్ సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి, దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థలను అత్యవసరంగా పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు.గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు, సరిహద్దు మండలాలు, గ్రామాల్లో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని, చేపల వేట, పశువులను మేపడం లేదా ఇతర ప్రమాదకర కార్యకలాపాల కోసం ఎవరూ నదిలోకి వెళ్లకుండా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న లేదా రాకపోకలకు అంతరాయం కలిగిన రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఏవైనా అత్యవసర సంఘటనలు జరిగిన వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలి

-ఆర్అండ్ఆర్ కాలనీలోకి వరద నీరు చేరకుండా ఆర్ఎఫ్‌సీఎల్ తక్షణ చర్యలు చేపట్టాలి
-ఓసీ-3 ప్రాంతంలో యంత్రాలతో నీటిని వేగంగా తొలగించాలి
-భారీ వరద ప్రవాహాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలి
-రామగుండం వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్‌తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ప్రతినిధి జూలై-30 ( తెలంగాణ పత్రిక )





రామగుండం మున్సిపల్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షఅధికారులను ఆదేశించారు. గురువారం రామగుండం మున్సిపల్ పరిధిలోని 21వ డివిజన్ వీర్లపల్లి, ఓ.సి.పి - 3 ఏరియా,25వ డివిజన్ వరద ప్రభావిత ప్రాంతాలను రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్ రామగుండం అరుణ శ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వరద పరిస్థితులను, నీటి నిల్వను, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఆర్అండ్ఆర్ కాలనీలో వరదల సమయంలో నీరు ఇళ్లలోకి ప్రవేశించకుండా ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలను రూపొందించాలని ఆదేశించారు. ఓసీ-3 ప్రాంతంలో నిలిచిపోయిన వరద నీటిని యంత్రాల సహాయంతో అత్యంత వేగంగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి నిల్వల వల్ల ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, అవసరమైనచోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఆర్ఎఫ్‌సీఎల్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 4న జాబ్ మేళా నిర్వహణ

-జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్

పెద్దపల్లి, ప్రతినిధి జూలై - 30 ( తెలంగాణ పత్రిక )

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు హారే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ లో ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 4 మంగళవారం రోజున జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.?హారే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ సంస్థలో మంథని ప్రాంతంలో పనిచేయుటకు మొత్తం 72 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఇందులో ఆపరేషన్ మేనేజర్ 1, ప్రొడక్షన్ మేనేజర్ 2, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ 5, డిస్ట్రిబ్యూషన్ ఇన్ చార్జ్ 4, డిస్ట్రిబ్యూషన్ ఎగ్జిక్యూటివ్స్ 8, మెయింటెనెన్స్ ఇన్ చార్జ్ 2, మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్స్ 6, స్టోర్ ఇంచార్జ్ 3, స్టోర్ ఎగ్జిక్యూటివ్స్ 8, క్వాలిటీ ఇంచార్జ్ 3, క్వాలిటీ ఎగ్జిక్యూటివ్ 4, క్వాలిటీ



జూనియర్ ఎగ్జిక్యూటివ్ 8, కుక్స్/చెఫ్స్ 10, ఐటీ ఎగ్జిక్యూటివ్ 3, ప్రొక్యూర్‌మెంట్/పర్చేస్ 2, అకౌంట్స్ 2, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ 1 ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని తెలిపారు.సంబంధిత ఉద్యోగాలకు విద్యార్హతలు పదవ తరగతి, డిగ్రీ ,డిప్లొమా, బిటెక్, ఎంటెక్ ,మెకానికల్, ఎలక్ట్రికల్ , మార్కెటింగ్ ,కంప్యూటర్ సైన్స్, బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫుడ్ టెక్నాలజీ ,హోటల్ , హాస్పిటలిటీ, ఎంబీఏ పూర్తిచేసిన వయస్సు, అనుభవం కలిగిన పురుష అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 04 మంగళవారం రోజున ఉదయం 11 గంటలకు అప్‌డేట్ చేసిన సివి/రెజ్యూమ్, విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు జిరాక్స్, అనుభవ ధృవీకరణ పత్రం తీసుకుని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తులోని రూమ్ నెం. 233 జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం)కు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం అర్హులైన ఉపాధ్యాయుల దరఖాస్తులకు ఆహ్వానం

కామారెడ్డి, జులై 30, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు -- 2026 కోసం అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, పాఠశాల సహాయ ఉపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, తత్సమాన కేడర్ ఉపాధ్యాయులు, స్నాతకోత్తర ఉపాధ్యాయులు, శిక్షణ పొందిన స్నాతక ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నిర్దేశించిన దరఖాస్తు నమూనాలను సంబంధిత మండల విద్యాధికారి కార్యాలయాల నుంచి పొందాలని సూచించారు. పూర్తిగా నింపిన దరఖాస్తులతో పాటు అవసరమైన ధ్రువపత్రాల రెండు సెట్లను ఆగస్టు 10, 2026లోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, కామారెడ్డిలో తప్పనిసరిగా సమర్పించాలని అయన ఆ ప్రకటనలో కోరారు.

# జిల్లాలోనిఅధికారులకు సెలవులు రద్దు, అత్యవసరమైతేనే సెలవులు పెట్టాలి

-అదిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి
-కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి, జులై 30, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

అదిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని, అధికారులందరూ అందుబాటులో ఉండాలని కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి టెలి కాన్ఫరెన్స్ సమావేశం జిల్లా అధికారులతో నిర్వహించారు. మండలాలవారిగా అదిక వర్షాలతో జరిగిన పరిస్థితులను స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో , స్పెషల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ అదిక వర్షాల వల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలందరూ అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావాలన్నారు. అధికారులందరూ అందుబాటులో ఉండాలని, అత్యవసరం ఉంటే తప్ప అధికారులు సెలవులు పెట్టొద్దన్నారు. కలెక్టరేట్లో 08468220069 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగకూడదనీ,అత్యవసర పరిస్థితులలో ప్రజలను రక్షించేందుకు రోప్స్, డ్రోన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంటూ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలనీ సూచించారు. చెరువులు, కల్వర్టులు, కుంటలలో నీరు ప్రవాహం రీచ్ అయ్యే అవకాశం ఉన్న దగ్గర సైన్ బోర్డులు పెట్టి చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ హాస్టల్స్ అంగన్వాడి సెంటర్స్, రూఫ్ లీకేజీ ఉన్నట్లయితే ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లలో ప్రజలకు నివాసం ఉండకుండా చర్యలు చేపట్టాలనీ అధికారులను ఆదేశించారు వర్షాలు అధికమై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తే ప్రజలకు రాకపోకలు ఇబ్బంది కలకుండా ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలన్నారు. జిల్లా పంచాయతీ శాఖ ద్వారా సెక్రటరీలు ఎంపీవో లు సమన్వయంతో శానిటేషన్ పై ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ,నీరు నిల్వ ఉండు ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ ఫాగింగ్ నిర్వహించాలన్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందు వల్ల విద్యుత్ ప్రమాదాల జరిగే అవకాశం ఉన్నందున తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ ఆఫీసర్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా కృషి చేయాలన్నారు. అంటూ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాము కాటు, అంటువ్యాధుల , సీజనల్ వ్యాధుల మందులు అందుబాటులో ఉండాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్. అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ గిరి. జెడ్పీ సి ఈ వో చందర్, జిల్లా అధికారులు,ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తాసిల్దారులు స్పెషలాఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్ నినో పై వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీ లో మంత్రుల సమీక్ష



-రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి

-అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 30, తెలంగాణ పత్రిక

సూపర్ ఎల్ నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు.సూపర్ ఎల్ నినోపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కునేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన పీపీటిని ప్రదర్శించారు. జిల్లా ఎల్ నినో ప్రణాళిక, తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.జిల్లా పరిధిలోని ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి? వాటిలో నీటిమట్టం? జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు? మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా? విద్యుత్ సరఫరా తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సూపర్ ఎల్ నినో ప్రభావం దక్షిణ భారత దేశంపై ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని వివరించారు. ఇప్పుడు రిజర్వాయర్లలో ఉన్న నీరు తాగునీటికి మాత్రమే వచ్చే ఏడాది జూలై వరకు వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో కురిసిన వర్షం పంటలకు కొంత మేలు చేస్తుందని, కానీ పంట పూర్తిగా చేతికి వచ్చే వరకు ఉపయోగపడదని తెలిపారు. గత రెండు నెలలు సరిగా వర్షాలు సరిగా కురవక పంటల సాగు గణనీయంగా తగ్గిందని, వచ్చే నెలలో ఏ పంటలు సాగు చేస్తే మేలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరుతడి, స్వల్పకాలిక పంటలు, పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా వివరించాలని పేర్కొన్నారు. వాటికి కావలసిన అన్ని విత్తనాలు అందుబాటులో పెట్టాలని సూచించారు. మంచి ప్రణాళిక ప్రకారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.



**ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలి**

గత ఏడాదితో పోలిస్తే భూ గర్భ జలాలు రెండు మీటర్లకుపైగా లోతులోకి వెళ్ళాయని వెల్లడించారు. జిల్లాలోని అన్ని రిజర్వాయర్లలోని నీరు పంటలకు విడుదల చేసే అవకాశం లేదని, భూ గర్భ జలాల సమాచారం అధికారులు ప్రజలు, రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ జలసిరి కింద బోర్ వెల్స్ రీచార్జ్ పనులు, పామ్ పాండ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా చేయించాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. జిల్లాలోని మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని, రిజర్వాయర్ల నీటిని పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పంపింగ్ కోసం కావాల్సిన మోటర్లు అదనంగా సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు.నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎరువుల కొరత, ఇతర ఇబ్బందులపై వచ్చే అసత్య ప్రచారాలు చేయకుండా చూడాలని సూచించారు. పోలీస్ అధికారులు శాంతి భద్రతల పరిరక్షిస్తూనే ప్రతీ అంశంపై దృష్టి సారించాలని ఆదేశించారు.సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

**రైతులకు అవగాహన కార్యక్రమాలు..**

ఎల్ నినో, పంటల మార్పిడిపై జిల్లాలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, ఇంచార్జి మంత్రి సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. జిల్లాలో తాగునీటి సరఫరా కోసం శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయం కీలకమని తెలిపారు. గత ఏడాది జిల్లాలో లక్ష 85 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని, ఈ ఏడాది ఇప్పటి వరకు 78 వేలు సాగు అయిందని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతు భరోసా అందుతున్న రైతులందరికీ ఈ విషయమై ఫోన్లకు సమాచారం పంపుతున్నామని వెల్లడించారు. ఆగస్టులో సాగు చేసే పంటలపై ఇప్పటికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులకు మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాకు ఆయిల్ పామ్ 1500 ఎకరాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 400 ఎకరాలు పూర్తి చేయించామని, మిగతా పురోగతిలో ఉందని వెల్లడించారు. తెలంగాణ జలసిరి కింద జిల్లాలో నీటి సంరక్షణ పనులు పకడ్బందీగా చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రుతుపవనాలు బంగాళాఖాతంలో అల్పపీడనాల వల్ల వర్షాలు

-వాతావరణ అంచనాలు మనం ఆశించిన విధంగా లేవు ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉంటుంది

-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోందూరి గాంధీ

గంభీరావుపేట తెలంగాణ పత్రిక జులై 30

గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలంగాణ రైతులు సంతోషంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోందూరి గాంధీ రావు పేర్కొన్నారు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండూరి గాంధీ రావు మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మంచి రుతుపవనాలు బంగాళాఖాత అల్పపీడనాల వల్ల వర్షాలు కురవాలని ఆశిస్తున్నామన్నారు కానీ వాతావరణ అంచనాలు మనం ఆశించిన విధంగా ఏమాత్రం లేవన్నారు మనం పరిస్థితిని అర్థం చేసుకుని, సూపర్ ఏల్నినో ప్రభావం కోసం నిపుణులు ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం వ్యవహరించాలన్నారు రైతులకు సిఫార్సు చేయబడిన పంటల విత్తనాలు సులభంగా అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ పర్యవేక్షించాలన్నారు, పునరుద్ధరించబడిన వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం(ఆర్ డబ్ల్యు బి సిఐఎస్)అనేది భారత ప్రభుత్వ చొరవతో చేపట్టిన ఒక పథకం ఇది లోటు వర్షపాతం, అధిక వర్షపాతం, తీవ్రమైన ఉష్ణోగ్రతలు తేమ వంటి ప్రతికూల వాతావరణం వల్ల కలిగే ఆర్థిక నష్టాల నుండి రైతులను రక్షిస్తుందనన్నారు సాంప్రదాయ దిగుబడి-అంచనాపై ఆధారపడకుండా ఈ పథకం స్థానిక వాతావరణ-ఆధారిత "ట్రిగ్గర్లను" ఉపయోగించి చెల్లింపులను స్వయంచాలకంగా లెక్కించి, పంపిణీ చేస్తుందన్నారు, తెలంగాణ



ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఖరీఫ్ పంటకాలంలో సాగు చేసే భూమి అంతటికీ భీమా చేయించాలి. ఇందుకోసం అన్ని పిఎసిఎస్ వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు చొరవ తీసుకోవాలి రైతులందరూ పంటల భీమా చేయించుకునేలా చూడాలి తెలంగాణలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మొత్తం వర్షపాత లోటును పూడ్చడం సాధ్యం కాదు తీవ్రమవుతున్న ఎల్ నినో ప్రభావం రుతుపవన కాలం ద్వితీయార్థంలో వర్షపాత గతిశీలతను గణనీయంగా బలహీనపరు స్తుందని అంచనా వేయబడింది 2026 జూలై చివరి నాటికి, తెలంగాణ ఇప్పటికే 31శాతం నుండి 35 శాతం వరకు తీవ్రమైన మొత్తం వర్షపాత లోటుతో పోరాడుతోంది. దానిలోని 33 జిల్లాలలో 30 జిల్లాలు కరువు లాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి గత రుతుపవన కాలాల్లో బంగాళాఖాతంలో ఏర్పడే చివరి దశ అల్పపీడన వ్యవస్థలు సాధారణంగా తొలిదశ వర్షపాత లోటును భర్తీ చేసేవి. అయితే, భారత వాతావరణ శాఖ (ఐ యం డి ) ప్రపంచ వాతావరణ నమూనాలు ఈ సీజన్లో మిగిలిన కాలానికి స్థిరమైన వర్షపాత సరళి భారీగా కుప్పకూలుతుందని సూచిస్తున్నాయి బలపడుతున్న ఎల్ నినో రాబోయే వారాల్లో భూమధ్యరేఖ పసిఫిక్‌పై ఎల్ నినో చక్రం బలపడుతున్న కొద్దీ, అది దక్షిణ ద్వీపకల్పంపై వర్షాన్ని కురిపించే మేఘాలను చురుకుగా అణచివేస్తుంది. భారత వాతావరణ శాఖ ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలపై అడపాదడపా ఉరుములు భూగర్భ జలాలు, జలాశయాలను పునరుజ్జీవింపజేయ డానికి అవసరమైన విస్తృత, నిరంతర భారీ వర్షాలకు బదులుగా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసే వర్షం స్వల్పకాలిక, తీవ్రమైన, అత్యంత స్థానిక ఉరుముల రూపంలో ఉండే అవకాశం ఉంది. వీటి మధ్యలో వారాల తరబడి పొడి వాతావరణం ఉంటుంది, ఇది రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భారీ వర్షపాత లోటును ఏకరీతిగా పూడ్చడంలో విఫలమవుతుందన్నారు ఆగస్టు సెప్టెంబర్ నెలలకు అంచనా వర్షపాత శాతాలు పునరుద్ధరణకు బదులుగా, రాష్ట్రం మరింత పెరిగిన కాలానుగుణ లోటుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర వ్యవసాయ అత్యవసర సమీక్షలు మరియు ప్రస్తుత వాతావరణ ధోరణుల ఆధారంగా, మిగిలిన నెలల అంచనాలు కింద వివరంగా ఇవ్వబడ్డాయన్నారు, అంచనా వర్షపాతం లోటు పరిధి అంచనా సారాంశం ప్రాంతీయ ప్రభావం ఆగస్టు సాధారణం కంటే తక్కువ నుండి సాధారణం వరకు స్థానికంగా ఉత్తమ అవకాశం మార్పులను తట్టుకోగల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులను ప్రభుత్వం గట్టిగా కోరుతోందని తాను కూడా రైతంగానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు

# పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఎస్సై శేఖర్ రెడ్డి




తెలంగాణ పత్రిక జులై 30:

శంకరపట్నం మండలం ధర్మారం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే సమయంలో చట్టాలను గౌరవించడం, సామాజిక సామరస్యాన్ని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. గ్రామ సర్పంచ్ చింతిరెడ్డి పద్మ మాట్లాడుతూ ప్రజల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్‌వాదులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# స్కూల్ యూనిఫాంలో త్వరలో అందించండి

-అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



తెలంగాణ పత్రిక జూలై 30 యాదాద్రి భువనగిరి

మధ్యాహ్న భోజనం పథకం లో విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లు త్వరగా అందించాలని యాదాద్రి భువనగిరి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం పోచంపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ), మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించారు మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందిస్తున్నారా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి సౌకర్యం, వంటగది నిర్వహణను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి, మెనూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం, తాగునీటి సౌకర్యం, వంటశాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. యూనిఫాంల కుట్టు పనులను మరింత మంది టైలర్లను వినియోగించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అన్ని యూనిఫాంలను సిద్ధం చేసి విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కోశాధికారిగా చంద్రశేఖర్ నియామకం

పాపన్నపేట, జూలై 30: (తెలంగాణ పత్రిక)



మెదక్ జిల్లా పాపన్నపేట మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొడపాక లో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న నర్సగోని చంద్రశేఖర్ గౌడ్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పాపన్నపేట మండల శాఖ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పాపన్నపేట తపస్ మండల కార్యవర్గ సమావేశంలో మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పైతర దుర్గాప్రసాద్,బోయిని రాజశేఖర్ లు ప్రకటించారు. చంద్రశేఖర్ గౌడ్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల మండలం లోని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సంఘం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన తపస్ మండల కోశాధికారి నర్సగోని చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి సంఘ నాయకత్వానికి,మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు జిల్లాస్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం,వారి హక్కుల సాధన,విద్యా ప్రమాణాల పెంపు,సంఘం బలోపేతం కోసం అందరినీ కలుపుకొని పనిచేస్తానని తెలిపారు. ఈసందర్భంగా మెదక్ జిల్లా కోశాధికారి మంగ నర్సింలు తదితరులు ఉన్నారు.

## భారీ వర్షాల కారణంగా జాగ్రత్తలు పాటించాలి

-మేజర్ గ్రామపంచాయతీ ఈఓ అన్వర్ ఆలీ



ముధోల్:జూలై30(తెలంగాణ పత్రిక)

ప్రజలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా జాగ్రత్తలు పాటించాలని మేజర్ గ్రామపంచాయతీ ఈఓ అన్వర్ ఆలీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆయా కాలనీలో స్తంభించిన వరద నీరు, చెత్త చెదరని గ్రామపంచాయతీ సిబ్బందితో తొలగించారు. తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి శానిటేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రెండు రోజులు కురుస్తున్న వర్షాలకు దృష్టిలో ఉంచుకొని అత్యవసర సమయాల్లో తప్ప ఇండ్లనుండి బయటకి వెళ్ళరాదన్నారు. వాగులు, చెరువులు వద్దకు వెళ్లకూడదని సూచించారు. ముఖ్యంగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదని సూచించారు. గ్రామంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే గ్రామపంచాయతీ అధికారులకు తెలియజేయాలని కోరారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కామారెడ్డి ,జూలై 30,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాబీబీపేట్సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వై.ఆర్.జి కేర్ లింకు వర్కర్ స్కీం ఉమ్మడి జిల్లా డీ. ఆర్.పి. గర్దాసు సుధాకర్ తెలిపారు. గురువారం బిబిపేట మండల కేంద్రంలోని గ్రామ సంఘం కార్యాలయంలో సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాలు కురుస్తున్నందున వివిధ రకాల సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి దోమతెరలను వాడాలని తెలిపారు. చర్మవ్యాధులు, సుఖ వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. ఆయా వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ లింకు వర్కర్ బాలకిషన్, గ్రామ సంఘాల ప్రతినిధులు, వివో ఏలు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలో నూతనంగా లీలా ఆసుపత్రి ప్రారంభం

మిర్యాలగూడ ప్రతినిధి// జూలై 30:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లీలా ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం.సి. కోటి రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, తిప్పన విజయసింహ రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొని ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రిలోని వైద్య సదుపాయాలను పరిశీలించి, ఆధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ లీలా ఆసుపత్రి ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. పేద మధ్య తరగతి ప్రజలకు వైద్యం



అందుబాటులో ఉండాలని వారు అన్నారు. ఈకార్యక్రమంలో చింతరెడ్డిశ్రీనివాసరెడ్డి, దుర్గంపూడినారాయణరెడ్డి, ఎండి.మోశిన్అలీ, ఎండి.యూసుఫ్, ఎండి.ఇలియాస్ ఖాన్, జొన్నలగడ్డ రంగా రెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, అంగోతు హతిరాం నాయక్, కుందూరు వీరకోటి రెడ్డి, పాలుట్ల బాబయ్య, నిమ్మల నవీన్ రెడ్డి, వడ్డేపల్లి శ్రీనివాస్, జన్నపాల కిరణ్, బోనగిరి దేవేందర్, అబ్బగొని రమేష్, వింజం శ్రీధర్, పాచు నాయక్, ఎండి.షోయబ్, భూక్య



రాంబాబు, గయాస్, మునీర్, ధనావత్ వెంకటేశ్వర్లు, సూర్యా నాయక్, మాలవాత్ రవీందర్ నాయక్, బాల సత్యనారాయణ, కందుల నాగిరెడ్డి, కోర్రపిడత లింగారాజు, సుదీర్ కుమార్, అలీం, దొంతగాని వెంకన్న,షేక్ ఫయాజ్, వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యం మండడి సైది రెడ్డి, అశోక్, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలులి తెలిపారు.

## ఆర్‌జీయూకేటీ--బాసర్‌లో కొనసాగుతున్న పీయూసీ--I ఓరియంటేషన్ కార్యక్రమం

నిర్మల్ జిల్లా ప్రతినిధి జులై 30 (తెలంగాణ పత్రిక)

ఆర్‌జీయూకేటీ బాసరలో నిర్వహిస్తున్న పీయూసీ--I ఓరియంటేషన్ కార్యక్రమం--2026 నూతన విద్యార్థులకు ఎంతో ప్రేరణను ఇచ్చింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఎం. ఎల్. సాయికుమార్ ముఖ్య అతిథిగా హాజరై, నూతనంగా చేరిన విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సాయికుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషి, సమయపాలన, నైతిక విలువలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్‌జీయూకేటీలో లభించే నాణ్యమైన విద్య, ఆధునిక ప్రయోగశాలలు, సాంకేతిక వనరులు, పరిశోధనా అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేవలం అకాడమిక్ మార్కులకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యం, సామాజిక బాధ్యతను పెంపొందించుకుంటూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. విద్యాభ్యాసం, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ అవకాశాలు, విశ్వవిద్యాలయ జీవితానికి సంబంధించి తమకున్న పలు




అనుమానాలను ప్రొఫెసర్ సాయికుమార్‌తో పంచుకుని నివృత్తి చేసుకున్నారు. ప్రొఫెసర్ అందించిన అమూల్యమైన సూచనలు, ఆయన అనుభవాలు నూతన విద్యార్థులలో నూతనోత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ పాల్గొని ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రేరణదాయకంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రతిభను ప్రపంచ స్థాయి నైపుణ్యాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతోనే ఆర్‌జీయూకేటీ బాసర కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేస్తూ, అకాడమిక్స్‌తో పాటు సాంకేతిక ఆవిష్కరణల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్యాంపస్ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించి విశ్వవిద్యాలయానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని



ఆకాంక్షించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, వారి కలల సాకారానికి విశ్వవిద్యాలయ యాజమాన్యం ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ పీయూసీ--X ఓరియంటేషన్ కార్యక్రమం--2026 సమన్వయకర్త డా. గుజ్జరి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా నూతన విద్యార్థులకు విశ్వవిద్యాలయ విద్యా విధానం, క్యాంపస్ సౌకర్యాలు, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలు, క్లబ్‌లు, సాంకేతిక, వ్యక్తిత్వ వికాస అవకాశాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో పీయూసీ--I విద్యార్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో యామాపూర్ ఫకీర్ కొండాపూర్ గ్రామాల వాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎస్పీ

-ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

జగిత్యాల, జూలై 30 (తెలంగాణ పత్రిక):

మెట్పల్లి భారీ వర్షాల కారణంగా ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగును జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. వాగులో ప్రవాహ పరిస్థితులను పరిశీలించి ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల కారణంగా వాగుల ప్రవాహం ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని



సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పోలీసు రెవెన్యూ రెస్క్యూ పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పని చేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు



కలగకుండ చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు చేపల వేటకు నది ప్రవాహ ప్రాంతాలను చూడడానికి ప్రజలు వేల్లద్దని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ కు వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ ఎస్పీ కోరారు. వారి వెంట మెట్పెల్లి డిఎస్పీ రాములు తహసీల్దార్ ఎంపిడివో సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## ఉద్యమకారులపై అసత్య ప్రచారం తగదు

-జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం

గంభీరావుపేట తెలంగాణ పత్రిక జులై 30

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో జాతీయ మాలల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం గురువారం రోజున విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఢిల్లీ డిసిపి అమిత్ జా ఇక అబద్ధం చెప్పలేను అందుకే రాజీనామా చేశాను ప్రభుత్వం నేను ప్రెస్ ముందుకు వచ్చి వీధుల్లో తమ హక్కుల కోసం అడుగుతున్న విద్యార్థుల గురించి పచ్చి అబద్దాలు చెప్పాలని ఒత్తిడి చేస్తున్నారు వాళ్లను నేరస్తులుగా రుజువు చేయమని నాకు చెప్పారు నిజం చెప్పకుండా నన్ను ఆపి అమాయక విద్యార్థులను ఇరికించమని బలవంతం చేసే ఏ వ్యవస్థ లోను నేను భాగం కాలేను ఈ విద్యార్థులు ఉగ్రవాదులు కాదు మీరు మన దేశ భవిష్యత్తు నేను పోలీస్ ఉద్యోగం ఎంచుకుంది నిజానికి తోడుగా నిలబడడానికి అబద్ధాలు అమ్మడానికి కాదు ప్రభుత్వం చేస్తున్న ఈ పనికి నేను భాగస్వామిని కాలేను ఈరోజు నుండి నేను ప్రభుత్వంతో కాదు ఈ విద్యార్థులతో ఉంటానని చెప్పడం జరిగింది. వేల మంది విద్యార్థులు తమ హక్కుల కోసం, నియామక పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలపై పోరాడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం, వారిని దేశద్రోహులంటూ అక్రమ అరెస్టులు చేస్తూ, నిరసనలకు దిగిన వారిపై తమ ప్రభుత్వం సానుభూతిపరులతో దాడులు చేయిస్తూ, సోషల్ మీడియా




ఏజెంట్లతో అసత్య ప్రచారం చేస్తూ భారత ప్రజలను అవమానాలకు గురి చేసే కుట్రకు తెర తీయడం బాధాకరం. ఢిల్లీ నగర డిసిపి లాంటి పోలీస్ అధికారులను సైతం బెదిరింపులకు చేస్తూ విద్యార్థులపై అక్రమ కేసులకు పురికొల్పడం బాధాకరం. ఇకనైనా యువకుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి ప్రభుత్వం తన పనితీరును మార్చుకొని ముందుకు వెళితే రాబోయే తరం ప్రభుత్వాన్ని క్షమించే అవకాశం ఉంది. కేవలం రాజకీయ పదవుల కోసం దేశ ప్రజలనే అవమనించే దుస్సాహసానికి బిజెపి ప్రభుత్వం పూనుకోవటం చాలా బాధాకరం. ఇకనైనా తన తీరు మార్చుకోకపోతే భారతీయ యువతరం బిజెపి పార్టీని క్షమించని పరిస్థితి త్వరలో రానుందని రాష్ట్రవ్యాప్తంగా బందుకు పిలుపునిస్తే విద్యార్థులు నిరసన తెలియజేస్తే సిరిసిల్ల అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థి నాయకుల ఫ్లెక్సీలు తీసుకొని గందరగోళం చేసిన బిజెపి నాయకులు ఒక్కసారి గుర్తుంచుకోవాలి నీట్ లీకేజీ పేపర్ విషయంలో బిజెపి నాయకుల పిల్లలు కూడా జంతర్ మంతర్ వద్ద ధర్నాలో ఉన్నారని మర్చిపోవద్దని బిజెపి నాయకులను హెచ్చరిస్తున్నాం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన వెంటనే కొందరు కేంద్ర బిజెపి నాయకుల పిల్లలు కూడా సంబరాలు చేసుకోవడం జరిగింది ఎందుకంటే వారి పిల్లలు కూడా విద్యార్థులు నష్టపోయినవారే విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని కొంతమంది కేంద్ర నాయకులు తప్పుడు మాటలు మాట్లాడడం సరైన పద్ధతి కాదు కేంద్ర విదేశాంగ కార్యాలయం నుండి విద్యార్థులు చేస్తున్న ఉద్యమం సరైనదని చెప్పినప్పటికీ అవగాహన లేని మంత్రులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరైనది కాదు సిరిసిల్ల జిల్లాలో బిజెపి నాయకులు విద్యార్థులు నిరసన తెలియజేస్తే విద్యార్థి నాయకుడు అంగూరి రంజీత్ పైన దాడికి పాల్పడడం సరైనది కాదని జాతీయ మాలల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు

# ఎఫ్‌డీఓ పూర్తి స్థాయి నియామకం ఎప్పుడో

**-ఇన్‌చార్జి వ్యవస్థతో అటవీ శాఖలో జాప్యం**
**-భద్రాద్రి కొత్తగూడెం అటవీ వర్గంలో పెరుగుతున్న అసంతృప్తి**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (తెలంగాణ పత్రిక):**

భద్రాద్రి కొత్తగూడెం అటవీ శాఖలో పూర్తి స్థాయి ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ) లేకపోవడంతో శాఖ పనితీరు ప్రభావితమవుతోందని అధికారులు, సిబ్బంది, ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జిల్లా అటవీ అధికారికే (డీఎఫ్‌వో) ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ బాధ్యతలు అప్పగించడం వల్ల కీలక పరిపాలనా నిర్ణయాలు, అభివృద్ధి పనులు, ప్రజలకు సంబంధించిన ఫైళ్ల పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఒకే అధికారిపై రెండు కీలక బాధ్యతలు ఉండటంతో అన్ని అంశాలపై సమయానుకూలంగా దృష్టి సారించడం సాధ్యపడటం లేదని శాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో వివిధ అనుమతులు, పరిపాలనా ఆమోదాలు,




సిబ్బంది సేవా సంబంధిత ఫైళ్లు, అటవీ సంరక్షణ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని సమాచారం. అటవీ శాఖ పరిధిలో ప్రజలకు అందాల్సిన సేవలు కూడా జాప్యానికి గురవుతున్నాయని, అటవీ భూములు, అనుమతులు, ఇతర పరిపాలనా అంశాల్లో సమయానికి నిర్ణయాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాఖ అధికారులు, సిబ్బంది కూడా పూర్తి స్థాయి ఎఫ్‌డీఓ లేకపోవడం వల్ల పరిపాలనా వ్యవస్థలో స్పష్టత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం వంటి విస్తారమైన అటవీ ప్రాంతం కలిగిన జిల్లాలో పూర్తి స్థాయి ఎఫ్‌డీఓ ఉండటం అత్యంత అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇన్‌చార్జి వ్యవస్థను కొనసాగించడం కంటే అర్హత కలిగిన అధికారిని వెంటనే పూర్తి స్థాయి ఎఫ్‌డీఓగా నియమిస్తే శాఖ పనితీరు మరింత మెరుగుపడడంతో పాటు ప్రజలకు సకాలంలో సేవలు అందే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి భద్రాద్రి కొత్తగూడెం అటవీ విభాగానికి శాశ్వత ఎఫ్‌డీఓను తక్షణమే నియమించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటు కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జులై 30**

బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్ భద్రాద్రి కొత్తగూడెం టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్ అధ్యక్షతన బుధవారం టాటా లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ నందు అడ్వైసర్లుగా పని చేయుటకు సిద్ధంగా ఉన్న వారికి కొత్తగూడెం శ్రీ సాయి రామ్ ఫంక్షన్ హాల్ నందు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రైనింగ్ కు హాజరైన 150 అడ్వైసర్లకు మొక్కలు అందజేసి..తమ ఇంట్లో నాటుకుని మొక్క బ్రతికేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఓ వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి మొక్క నాటుతున్న ఫోటో, మొక్క బాగోగులు చూస్తున్న ఫోటోలు అప్లోడ్ చేయాలని సూచించారు. టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ యొక్క లక్ష్యం ప్రతీ ఇంటికి వారి మానవ విలువను తగిన ఇన్సూరెన్స్ పాలసీ అందించడం అని ఈ ట్రైనింగ్ ద్వారా ప్రతీ ఇంటికి ఇన్సూరెన్స్ అందిస్తామనే సంకల్పాన్ని తీసుకోవడం జరిగింది. బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికే కాదు, మన ఆరోగ్యానికి సమాజానికి కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.ఆక్సిజన్‌ను అందిస్తాయి -- మనం శ్వాసించడానికి అవసరమైన



స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. కాలుష్యాన్ని తగ్గిస్తాయి గాలిలోని కార్బన్ డైఆక్సైడ్ ఇతర కాలుష్య పదార్థాలను గ్రహించి గాలిని శుభ్రపరుస్తాయి.వాతావరణాన్ని చల్లగా ఉంచుతాయి ఉష్ణోగ్రతలను తగ్గించి చల్లని వాతావరణాన్ని కల్పిస్తాయి.వర్షాలకు తోడ్పడతాయి -- పచ్చదనం పెరగడం వల్ల వర్షపాతం మెరుగుపడటానికి సహాయపడుతుంది. నేల కోతను నివారిస్తాయి చెట్ల వేర్లు మట్టిని బలంగా పట్టుకుని నేల కోతను తగ్గిస్తాయి. పక్షులు, జంతువులకు ఆశ్రయం కల్పిస్తాయి జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.పండ్లు, పూలు, ఔషధాలు అందిస్తాయి అనేక మొక్కలు ఆహారం ఔషధాల మూలంగా ఉపయోగపడతాయిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ శర్మ , బ్రాంచ్ బిజినెస్ అసోసియట్ మేనేజర్ రాహుల్, సునీత, టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ లీడర్లు తారప్రసాద్, కేశవరావు, మహేష్, ఉమాకర్, నాగులు మీరా,రమేష్, రవీందర్, శివలీల, బాబురావు, కృష్ణార్జున, బొర్రా రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల బహుమతి

**-'రహవీర్' -- పీఎం రహత్ పథకాలపై కామారెడ్డిజిల్లా కలెక్టర్**

**కామారెడ్డి, జులై 30, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహవీర్ ' పీఎం రహత్ పథకాలను కామారెడ్డి జిల్లాలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు . గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగవాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాద బాధితులను 'గోల్డెన్ అవర్'లోపు ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం తరపున



రూ.25,000 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.1.5 లక్షల వరకు ఉచిత (క్యాష్‌లెస్) వైద్యం అందించే పీఎం రహత్ పథకం అమలులో ఉందని వెల్లడించారు.

**ముఖ్య ప్రయోజనాలు**

ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స

ప్రమాదం జరిగిన తేదీ నుండి 7 రోజుల వరకు ఉచిత వైద్యం గరిష్టంగా 1.5 లక్షల వరకు వైద్య ఖర్చులు భరిస్తారు

జాతీయ రహదారులు మాత్రమే కాదు -- ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా వర్తింపు

లబ్ధిదారులు :రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రతి బాధితుడు

ప్రమాద బాధితుడికి వెంటనే సహాయం చేసిన వారికి 25,000 ప్రోత్సాహం

పోలీసులు లేదా కోర్టుల ఇబ్బందుల భయం అవసరం లేదుసహాయం చేసిన వారి వ్యక్తిగత హక్కులకు చట్టపరమైన రక్షణ ఒక వ్యక్తి సంవత్సరానికి గరిష్టంగా 5 సార్లు బహుమతి పొందవచ్చు లబ్ధిదారులు: ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి చేర్చిన సహాయకుడు ఈ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా, పోలీసు సూపరింటెండెంట్, జిల్లా రవాణా అధికారిసంతోష్ కుమార్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) వేంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 30, తెలంగాణ పత్రిక**

జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, శిథిలావస్థలో ఉన్న భవనాలు, లో లెవెల్ కల్వర్టులు, రహదారులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆస్తి,



ప్రాణ, పంట నష్టం సంభవిస్తే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకు డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో అత్యవసర సమాచారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే 9398684240 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## మీరు కలర్ కలర్ పాపడాలు తింటున్నారా? ఇవి రసాయనాలతో తయారు చేసినవి మీకు తెలుసా



**తెలంగాణ పత్రిక ప్రతినిధి**

రకరకాల రంగుల్లో, ఆకర్షణీయంగా కనిపించే కలర్ కలర్ పాపడాలు మరియు వడియాలు మన ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయి. ఇటీవలే పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో కృత్రిమ రంగులు కలిపిన కలర్ కలర్ పాపడాల విక్రయాలపై ఆహార భద్రతా అధికారులు ఉక్కుపాదం మోపి, నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. అదే తరహాలో తెలంగాణలోనూ ఈ హానికరమైన కలర్ కలర్ పాపడాలపై తక్షణమే నిషేధం విధించాలని ప్రజా ఆరోగ్య నిపుణులు, వినియోగదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కలర్ కలర్ పాపడాలు ఆకర్షణీయంగా కనిపించడానికి తయారీదారులు అనుమతి లేని, రసాయనాలతో కూడిన రంగులను ఉపయోగిస్తున్నట్లు ఆహార భద్రతా తనిఖీల్లో తేలింది. ముఖ్యంగా రోడమైన్-బి వంటి ప్రమాదకరమైన కృత్రిమ రంగులను వీటిలో వినియోగిస్తున్నారు. ఈ కలర్ కలర్ పాపడాలు తినడం వల్ల జీర్ణక్రియ రుగ్మతలు, కడుపులో మంట, కాలేయం మరియు మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి మహమ్మారి బారిన పడే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ప్రధాన నగరాలు, గ్రామాల్లో ఉన్న స్థానిక సంతలు, కిరాణా షాపుల్లో ఎటువంటి వివరాలు లేదా అనుమతులు లేకుండానే ఈ కలర్ కలర్ పాపడాలు విక్రయిస్తున్నారు. రాష్ట్ర ఆహార భద్రత అధికారులు తక్షణమే రంగంలోకి దిగి అన్ని మార్కెట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించి రసాయన రంగులు కలిపే తయారీదారులపై మరియు విక్రేతలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కలర్ కలర్ పాపడాలు చూడటానికి ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, అవి విషంతో సమానమని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు ఇవి తినిపించడం ఎంతో ప్రమాదకరం. సహజ సిద్ధమైన, ఎటువంటి రంగులు లేని సాంప్రదాయ పాపడాలను మాత్రమే వాడటం మన కుటుంబ ఆరోగ్యానికి శ్రేయస్కరం.

## సమ్మక్క-సారక్క బ్యారేజ్ గేట్లు ఎత్తడంతో రేగుమాకు వాగు పొంగి NH-163 నీట మునిగింది

**-25 గ్రామాలకు స్తంభన**



**వాజేడు జులై 30 వాజేడు తెలంగాణ పత్రిక ప్రతినిధి**

కీసరి ప్రసాద్ ఎగువున ఉన్న మహారాష్ట్ర రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి భారీగా వరద వచ్చింది.టేకులగూడెం గ్రామం వద్ద ఉన్న సమ్మక్క-సారక్క బ్యారేజ్ ప్రాజెక్టు గేట్లన్నీ పైకి ఎత్తడంతో రేగుమాకు వాగుకు భారీగా వరద నీరు చేరింది.దీంతో ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం వద్ద 163 వ జాతీయ రహదారి పూర్తిగా నీట మునిగింది.తెలంగాణ-ఛత్తీస్గఢ్ సరిహద్దులో ఉన్న ఈ రోడ్డు మునిగిపోవడంతో ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డు మునిగిపోవడంతో ఇరువైపులా ఉన్న భారీ వాహనాలు, ప్రయాణికుల వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.ఇప్పటికే చీకుపల్లి వద్ద ఇసుక వాగు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో, టేకులగూడెం వద్ద రోడ్డు మునిగిపోవడంతో 25 గ్రామాలకు రవాణా పూర్తిగా స్తంభించింది.ఆ 25 గ్రామాల ప్రజలు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది.రోడ్డు నీట మునిగిపోవడంతో నిత్యావసర సరుకులు, కూరగాయలు, గ్యాస్ సిలిండర్లు, అంబులెన్స్ సౌకర్యం, గృహనిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఐరన్ తదితరాలు గ్రామాలకు రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టేకులగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీ చిడెం బాలకృష్ణ గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్డుపై వాహనాలు అటు ఇటు వెళ్లకుండా బ్యారికేడ్లు, గ్రామపంచాయతీ ట్రాక్టర్ ను రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేయించారు. వరద తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని సర్పంచ్ విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS

# సలబత్‌పూర్ చెక్‌పోస్ట్ ఘటనపై ప్రాథమిక విచారణకు ఆదేశాలు

-జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి



కామారెడ్డి ,జూలై 30, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ మద్యం, గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు సలబత్‌పూర్ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసి గత రెండు దశాబ్దాలుగా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి తెలిపారు. చెక్‌పోస్ట్‌లో ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు చేపడుతున్నారని పేర్కొన్నారు. నిన్న సాయంత్రం రాజస్థాన్ నుంచి వచ్చిన ఒక ట్రక్కులో ప్రయాణిస్తున్న యూట్యూబర్ చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడిన సందర్భంగా వివాదం చోటుచేసుకుందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెంటనే ప్రాథమిక విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. ప్రాథమిక విచారణలో ఘటనకు సంబంధించి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిని గుర్తించినట్లు తెలిపారు. ఈ అంశంపై శాఖాపరమైన పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని, విచారణ నివేదికను కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (నోడల్ అధికారి)కి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. సదరు కానిస్టేబుల్‌పై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేయాలని సిఫారసు చేస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ముకుంద రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై శాఖ ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించదని, విధి నిర్వహణలో నిబంధనలు, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బాధ్యులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పు చేశారు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జులై 30 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు.గురువారం ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్..**

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెలకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

# సిరిసిల్ల సుభాష్ నగర్ రైతు బజార్‌లో వర్షపు నీటి సమస్యలు

-తీవ్ర అవస్థలు పడుతున్న రైతులు, వ్యాపారులు, వినియోగదారులు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి , జూలై 30,తెలంగాణ పత్రిక

సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌లో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రైతు బజార్‌లో మౌలిక వసతుల లోపం కారణంగా రైతులు, వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్వల్ప వర్షానికే రైతు బజార్ ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోతుండటంతో కొనుగోలు, అమ్మకాలు దాదాపు స్తంభించే పరిస్థితి నెలకొంది.రైతులు ఎంతో కష్టపడి పండించిన కూరగాయలు, పండ్లు విక్రయించేందుకు రైతు బజార్‌కు తీసుకొస్తుండగా, వర్షపు నీరు ప్రాంగణంలో నిలిచిపోవడంతో వాటిని భద్రంగా ఉంచడం కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేకుల షెడ్ ఏర్పాటు చేసినప్పటికీ, వర్షపు నీరు షెడ్ లోపలికి చేరి నేలపై నిల్వ ఉండటంతో కూరగాయలు తడిసి పాడై ఆర్థిక నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ



సరిగా లేకపోవడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లక బజార్‌లోనే నిలిచిపోతోందని స్థానికులు పేర్కొంటున్నారు. నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు వినియోగదారులు ఈ పరిస్థితుల కారణంగా రైతు బజార్‌కు రావడానికే వెనుకాడుతున్నట్లు తెలిపారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ రైతు బజార్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.సంబంధిత మున్సిపల్, మార్కెటింగ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి రైతు బజార్‌ను పరిశీలించి, నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు, వ్యాపారులు, వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల శ్రమ వృథా కాకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రైతు బజార్‌లో అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించాలని వారు కోరుతున్నారు.

# రోడ్డు నిర్మాణంపై అవాస్తవ ప్రచారాలు నమ్మవద్దు: తిమ్మంపేట రైతులు

మంగపేట,జూలై30 (తెలంగాణ పత్రిక)

ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామంలోని 'ఆరు మోరిల రోడ్డు' నిర్మాణంపై దంతనపల్లి నరేందర్ చేసిన ఆరోపణలను స్థానిక రైతులు తీవ్రంగా ఖండించారు. రోడ్డు నాణ్యతగా లేదని, రైతులు నష్టపోతున్నారని నరేందర్ పత్రికల్లో చేసిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు.గురువారం రోడ్డు వద్దకు చేరుకున్న స్థానిక రైతులు ఆక సత్యనారాయణ, ఆక సతీష్ తదితరరైతులు మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణం సమయంలో తామందరం అక్కడే ఉండి నాణ్యతగా వేయించుకున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లు తమ



సూచనల మేరకే బలంగా పనులు చేశారని చెప్పారు.

**జేసీబీతో తవ్వడం వల్లే కుంగుబాటు**

నరేందర్ స్వార్థంతో జేసీబీ యంత్రంతో రెండు మీటర్ల లోతు తవ్వడం వల్లే వర్షాలకు ఆ ప్రాంతంలో రోడ్డు కుంగిపోయిందని రైతులు ఆరోపించారు. తమకు ఎలాంటి నష్టం జరగలేదని, వ్యక్తిగత కారణాలతోనే నరేందర్ ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నాడని మండిపడ్డారు.

**అధికారులు చర్యలు తీసుకోవాలి**

సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి వాస్తవాలను పరిశీలించి, అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు చిలకమర్రి లక్ష్మయ్య, దంతనపల్లి భద్రయ్య, చిన్నబాబు, ఆక వెంకటేశ్వర్లు, చిలకమర్రి ముత్తయ్య, చిలకమర్రి నరేష్, దంతనపల్లి పురుషోత్తం, చిలకమర్రి సతీష్, పూజారి పూర్ణయ్య, ఆక ఓంకార్, చిలకమర్రి శివ, పూజారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రుల పూజలు







-సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలి
-మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్
-స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే

వేములవాడ, జూలై,30, తెలంగాణ పత్రిక.

సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ కు చేరుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. మంత్రులకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి.. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జూలై 30వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు.అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. భీమేశ్వర సదన్‌లోని ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శాలువాలతో మంత్రులను సత్కరించి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి, అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను పట్టించుకోని కుమారుల విషయంలో కోర్టు సంచలన తీర్పు...

ఈ మధ్య కాలంలో చాలా మంది పిల్లలు 9 నెలలు కని పెంచి పెద్దవాళ్లను చేసిన తల్లిదండ్రులనే పట్టించుకోవడం లేదు. వయసు మళ్లిన పేరెంట్స్‌ను పట్టించుకోకుండా నానా ఇబ్బందులకు గురిచేస్తున్నా రు. తాజాగా ఇలానే తన తల్లిదండ్రులను ఇబ్బంది కలు గురిచేసే ఓ కొడుకుకు నంద్యాల జిల్లా కోర్టు ఊహించని షాక్ ఇచ్చింది. అతనికి నెల రోజుల పాటు జైలు శిక్ష విధించింది. తల్లిదండ్రులను కష్టపెట్టేవారికి, సమాజంలో అశాంతిని సృష్టించేవారికి చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని ఈ తీర్పు ద్వారా సమాజానికి స్పష్టమైన సందేశం అందింది.న్న తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్నకొడుకే వారి పాలిట యముడైతే.. చట్టం తన విధిని కచ్చితంగా నిర్వహి స్తుందని నంద్యాల కోర్టు మరోసారి నిరూపించింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వేధించడంతో పాటు, గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేసిన ఓ యువకుడికి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నెల రోజుల పాటు సాధారణ జైలు శిక్ష విధించింది.వివరాల్లోకి వెళ్తే.. బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన విజయవర్ధన్ రెడ్డి తన ఇంట్లో తల్లిదండ్రులతో పాటు చుట్టు పక్కల వారితోనూ నిత్యం గొడవలకు దిగుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవాడు. అతని అల్లరి ప్రవర్తనతో విసిగిపోయిన గ్రామస్థులు, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండి ఆత్మకూరు పోలీసులు రంగప్రవేశం చేసి నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి.. సాక్ష్యాధారాలు, నిందితుడి నేర స్వభావాన్ని పరిశీలించి అతనికి నెల రోజుల జైలు శిక్షను ఖరారు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు తక్షణమే నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కష్టపడి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను కడతేరుస్తూ, సమాజంలో అశాంతిని సృష్టించే మృగాళ్లలా ప్రవర్తించేవారికి ఈ తీర్పు ఒక కనువిప్పు అని మేధావులు, సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సమాజంలో బాధ్యతారహి తంగా ప్రవర్తించే యువతకు, ముఖ్యంగా కన్నవారినే కన్నీరు పెట్టిస్తున్న కొడుకులకు ఈ సంచలన తీర్పు ఒక బలమైన చెంపపెట్టు లాంటిదని సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ తీర్పు ద్వారా పోలీసులు, న్యాయస్థానాలు సమాజానికి ఒక స్పష్టమైన, బలమైన సందేశాన్నిచ్చాయి. ఎవరైనా సరే చట్టాన్ని చేతిలోకి తీసుకున్నా, వృద్ధులైన అమ్మానాన్నలను వేధించినా, గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించినా ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ తరహా కఠిన శిక్షలు అమలైతే సమాజంలో మార్పు వస్తుందని, వృద్ధ తల్లిదండ్రులు ప్రశాంతంగా జీవించడానికి భద్రత ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చట్టం ముందు ఎవరూ చుట్టాలు కాదనే నిజాన్ని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిం

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143